# మిసిమి

మాస పత్రిక

జులై - 1998

వెల - రూ॥ 6/-



# ముఖచిత్రం

అధి వాస్తవికవాదం అధికారికంగా 1924 లో ప్రారంభమైంది. దీని ముఖ్యలక్షణాలు తెలియాలంటే మనం ఆంద్రీబ్రెటన్‌ను మార్సెల్ రేమాండ్‌ను అడగాలి. అధి వాస్తవికవాదం ఒక నామవాచకం. అది పూర్తి స్వయం చాలకం. దీని ద్వారా అసలు వాస్తవిక ఆలోచనా ప్రక్రియను అభివ్యక్తం చేయడం అసలు ఉద్దేశం. ఈ అభివ్యక్తీకరణ శాబ్దికంగా లేదా రాతపూర్వకంగా లేదా మరో విధంగానైనా జరగవచ్చు. ఇలా అభివ్యక్తం అయ్యే ఆలోచన తార్కికాలోచనకు, హేతుబద్ధ ఆలోచనకు భిన్నం. దీని మీద ఎవరి అదుపు ఉండదు. దీనికి సౌందర్యం, నైతిక విలువలతో పనిలేదు. అంతేకాదు అధివాస్తవిక వాదం ఒక విశ్వాసం మీద ఆధారపడింది. ఆ విశ్వాసం ఏమిటంటే: ''కొన్ని రూపాల, ఆకృతుల సంసర్గంతో రూపొందే ఒక ఉన్నత సత్యం ఉంది. ఇటువంటి ఆకృతుల సంసర్గాన్ని మనం స్వప్నాలలో చూస్తాము. అంతేకాదు, అలాంటి సంసర్గరూపాలను నిష్కామ ఆలోచన (disinterested thought) లో కూడా చూస్తాము. ఇటువంటి 'ఉన్నతవాస్తవికతను' (superior reality) ఇంతకు ముందు ఎవరూ పట్టించుకోలేదు. ఇటువంటి అధి వాస్తవికత ప్రక్రియ మిగతా అన్నిరకాల మానసిక యంత్రాంగాలను తోసిరాజని, వాటి స్థానాన్ని ఆక్రమించి ఇదే జీవన సమస్యకు ముఖ్య పరిష్కారం అవుతుంది.

రేమాండ్ దృష్టిలో వస్తువుల 'యధాతధస్థితి', నుంచి అంటే వాస్తవికత నుంచి దూరంగా జరిగే కాల్పనిక ప్రవృత్తిని అధి వాస్తవికత ప్రతిబింబిస్తుంది.

వాస్తవికతను శంకించే ప్రవృత్తి చాల విలువైనదని కవులందరికి ఇది వరకే తెలుసు. ఇప్పుడది తప్పనిసరి అయింది కేవలమైంది. ''మనస్సుకు పరిపూర్ణ స్వేచ్ఛ ఉండాలి; జీవితం, పద్యం మరెక్కడో ఉన్నాయని ధృవీకరించాలి. ఆ రెండింటిని విడివిడిగా, ఒక దానితో ఒకటిని. ఎట్టి పరిస్థితులలోనైనా జయించాలి, ఎందుకంటె అంతిమంగా అవి ఒకదానితో ఒకటి మిళితమవుతాయి. మిళితమై ఈ ఆభాసిక ప్రపంచాన్ని అవి కాదంటాయి. ఇంకా ఒక నిష్ఠుర నిర్ణయం. తీసుకొనేదశకు చేరలేదని, ఇంకా ఏమీమించి పోలేదనే విషయానికి అవి సాక్ష్యం పలుకుతాయి''. ఈ రకమైన ఆహ్వానంలో అధివాస్తవిక వాదసారం ఉంది.

**ముఖచిత్రం :**

''మెరుగుతున్న నీడ'' చిత్రకారుడు బ్రూటా రామేశ్వర్. 1941 లో జన్మించాడు. ఇతడు అధివాస్తవిక వాద చిత్రకారుడు. అధి వాస్తవిక వాద పరిధులలోనే, వికాస్ భాట్టాచార్య , డా. వెంకటపతి, లక్షణ గౌడ్‌ల లాగా, ఇతడూ చాల శక్తిమంతమైన, కొన్ని సార్లయితే దిగ్భ్రమ గొలిపే నాటకీయ రామణీయకతో, మన అవ్యవహిత పరిసరం, సమాజాల మీద నిశిత వ్యాఖ్యానం చేశాడు. అందులో 'మెరుగుతున్న నీడ' ఒకటి.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." — Dammapada.**

సంపుటి 10 | జులై 1998 | సంచిక 7

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయసూచిక


'సినీవాలి' లో నగర జీవనం - మో

హోల్డార్ లాక్స్‌నె -సి. విజయశ్రీ

సాహిత్యంలో సైన్సు - టెక్నాలజి - నాగసూరి వేణుగోపాల్

సూత పురాణంలో కృష్ణుడు - రావెల సాంబశివరావు

ఆధునికత - ఆధునికానంతరత - శివలింగం

హిందూ మతం అర్థాలు - అపార్థాలు - అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి

రాజనీతి సూచిక : సామ్రాజ్య లక్ష్మి పీఠిక - ఘట్టమ రాజు

అంతరంగపు చిక్కుదారుల అక్షర చిత్రాలు గీసిన కవి - యస్. ఎ. మహమ్మద్



విడిప్రతి రూ. 6/- వార్షిక చందా రూ. 70/-

ముఖచిత్రం : **"మొరుగుతున్న నీడ"**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.;
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# పాఠకులకో మనవి

'**మిసిమి**'ని గురించి మీరు వాస్తవంగా ఏమను కొంటు న్నారో మాకురాయండి. మీ అభిప్రాయాలు మమ్మల్ని తెలుసుకోనీయండి. మీరునిర్మొహమాటంగా, స్వేచ్ఛగా రాయండి. '**మిసిమి**' ప్రచురించే వ్యాసాలు ఎలా ఉన్నాయి? ఇంకా ఏమైనా శీర్షికలు ప్రవేశపెడితే బాగుంటుందని మీరు భావిస్తున్నారా? ఒక మంచి మాస పత్రికను మీ ముందుంచడానికి తగు సూచనలు ఇవ్వండి.

'**మిసిమి**'కి ఈ ఏడాదితో దశాబ్ది పూర్తి అవుతుంది. అందుకని ప్రత్యేక దశాబ్ది సంచికను వెలువరించాలను కొంటున్నాము. ఈ దశాబ్ది సంచిక ఎలా ఉంటే బాగుంటుందని మీరనుకొంటున్నారో తెలియజేస్తే సంతోషం.

మీ ప్రతిస్పందనలే మాకు మార్గ నిర్దేశకాలు

**- సంపాదకుడు**

## చందాదారులకు విజ్ఞప్తి

పత్రికా నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన కారణంగా మిసిమి చందారేట్లు సవరించక తప్పని సరిఅయింది.

చందాదారులు, పాఠకులు సహకరిస్తారని ఆశిస్తున్నాం.

నూతన రేట్లు ఆగస్టు నుంచి అమలులోకి వస్తాయి. సవరించిన రేట్ల ప్రకారం అదనంగా చెల్లించవలసిన మొత్తాన్ని చందాదారులు తమ చందా పునరుద్ధరణ సమయంలో చెల్లించవలసిందిగా అభ్యర్థిస్తున్నాము.

మిసిమి విడిపత్రిక రు. **8/-**
సంవత్సర చందా రు. **100/-**

**'మిసిమి'**
**యాజమాన్యం**

# 'సినీ వాలి'లో నగర జీవనం

- మో.

(తను సృష్టించిన చరిత్రకు వెలుపల మనిషికి ఎటువంటి స్వభావం లేదు. అంతడు ఏమికాడు, ఏమి లేదు. తను సృష్టించుకొన్న చరిత్రలో మనిషిగా ఆరుద్ర (భాగవతుల సదాశివ శంకర శాస్త్రి) కాలం చెరిపినా చెరగని ఎన్నో రాతలు రాశాడు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, త్వమేవాఽహం, సినీవాలిలు ఆయన రాతల రూపంలో ఆయన పరిశోధనకు సృజనకు తార్కాణంగా నిలుస్తాయి.

జూన్ 4, 1998 న ఆయన కాలధర్మం చెందారు. సాహితీ కుటుంబానికీ, ఆయన కుటుంబానికి ఆయన లేని లోటు లోటే. లోటువలని బాధను 'మిసిమి' కూడ పంచుకుంటున్నది. - సంపాదకుడు)

ఈ వ్యాసాన్ని సమగ్రంగా కాక సంగ్రహరూపంలోనే రాయవలసి వచ్చింది. కాబట్టి నా దృష్టి కోణాల్ని కొన్ని సూచనలుగా తెలుపుతాను.

1. 'సినీ వాలి' లోని 'స్వవిషయ సూచిక - సాహిత్యోపనిషత్' లో వినిపించే ఆరుద్ర, శ్రీశ్రీ చివరికి వరద చేసిన సంవాదాలు, సంభాషణలు విప్పుకున్న సందేహాలు 'సినీ వాలి' కావ్యానికి కేవలం అనవసర ప్రసంగాలుగానే ఈ నాడు మిగిలి పోతాయ్. కవిత్వాన్ని గురించిన కవిత్వ ఉపనిషత్ అనే భ్రమలో ఆ ముగ్గురూ పడిపోయి నట్టున్నారు. ఒకరు హైబ్రోగా (శ్రీశ్రీ) ఒకరు లోబ్రోగా (ఆరుద్ర) మధ్యలో వాదంలోకి ఇరుక్కున్న (వరద) మిడిల్‌బ్రోగా నటనాభివేశాన్ని మాత్రమే ప్రదర్శించారు.

ఈ 'సాహిత్యోపనిషత్' కంటే 1953 లో శ్రీశ్రీ, ఆరుద్ర, వరద ముగ్గురూ కలిసిరాసిన ''మేమే'' మహా గొప్పదైన కవిత్వ తత్వవిచారం.

2. తెలుగులో 'సినీవాలి' మొట్టమొదటి నగర జీవన కావ్యం కాదు. సరాబి 'ఫిడేలురాగాల డజన్' 1939 లోనే అచ్చయింది. నిరుద్యోగి వెంకట్రావు మీద చెట్లు కూలుతున్న దృశ్యాన్నీ (1954) పరిత్యాగి 'పరివేదన'ను (1951) 'సుషుప్తి' (1954) నీ అజంతా వర్ణించేసాడు. 'సినీవాలి' మొదటి ముద్రణ 1960 లో, దానిలోని భాగం ''ఎన్జీవో సూర్యుడి కథ''గా 1952 లో రాసాడు.

3. అల్పజీవులూ జీవనయాత్రలో అసమర్థులూ చరమరాత్రిలోని కోనేటి రావులూ ఋణానంద అప్పారావులూ ఆధునిక జన జీవితంలో మెటఫర్స్‌గా అప్పటికే నిలిచి పోయారు. ఆరుద్ర 'సినీవాలి' లోని క్లార్కు సూర్యారావు ఆ క్రమంలోని వాడే. ప్రగతి భావాలుకల సూర్యుడు శాంతి'ని పెళ్ళి చేసుకొని కచేరీ గుమస్తా సూర్యా రావయిపోయాడు చివరికి, ఊహా సుందరి కాస్తా చిక్కి శల్యమై గుమ్మం ముందు కుప్పకూలి పోయింది.

4. ఆరుద్ర 'సినీవాలి' కావ్యరచనకు ముందుగా ఆంగ్లకవిత్వంలో ఏయే కవుల్ని చదివి ఉంటారు? ఎలియట్ 'వేస్ట్‌లాండ్' ని (1922) తప్పక చదివే ఉంటారు. న్యూయార్క్ నగరంలోని సిటీలైట్స్ కవుల్నీ చదివే ఉంటారు. అలెన్ గిన్స్‌బర్గ 'హీల్ అండ్ అదర్ పోయమ్స్' 1956లోనే అచ్చయిపోయింది. ఆడెన్ కవిత 'ది అన్‌నోన్ సిటిజన్' చదివే ఉంటారు. ఆడెన్ వ్యాసం. 'దిసిటీ అండ్ ది పొయట్' చూచే ఉంటారు.

5. నగర జీవన క్షోభనీ పేదరికాన్నీ దాని ఆంతరిక వైరుధ్యాలనూ ఆ పిమ్మట చాల మంది తెలుగు కవులు పట్టించుకోవటం మొదలు పెట్టారు. 'రాత్రి' అనే కవితా సంకలనం 1964 లో వచ్చింది. దిగంబర కవిత్వంలో అంతర్లీనంగా ఉన్న ప్రవాహం అంతా నగర జీవితం గురించే. బాలగంగాధర తిలక్ 1965లో రాసిన కవిత 'సి.ఐ.డి. రిపోర్ట్' ఆడెన్ కవితకు అచ్చమైన అనుసరణ - ''ది అన్ నోన్ సిటిజన్'కి కాని ఆయన అలా ప్రకటించలేదు.

6. విలియం బ్లేక్ కవిత 'లండన్', ఎలియట్ 'ప్రిల్యూడ్స్', రాబర్ట్ లోవెల్ కవిత 'సెంట్రల్ పార్క్', డెనిస్ లెవర్టోల్ చిన్న కవిత 'ఫిబ్రవరి ఈవెనింగ్ ఇన్ న్యూయార్క్' ఆరుద్ర చదివే ఉంటారు.

7. బైరాగి 'నూతిలో గొంతుకలు' (1974) 'మల్లెపూలు' (?) 'పలాయనం' (?) కవితలు నగరజీవన చిత్రణల్లోని పొడిగింపే. సందేహ కవితలే. సి. విజయ లక్ష్మి 'విషాద భారతం' (1975) కావ్యం కూడ దీని కొనసాగింపే. 1962 లోనే, దిగంబర అవతారం ఎత్తకముందుగా నగ్నముని కేశవరావుగా 'ఉదయించని ఉదయాలు' రాసి దానికి ఆరుద్రతోనే ' ఒప్పో, తప్పో మెప్పు'ని రాయించుకున్నాడు.

8. అసలు ఆంధ్రకవులకున్న నగరాలెన్ని? పఠాభి నగరం మద్రాసు. ఆరుద్ర నగరానికి ప్రత్యేకించి ఊరూ పేరూ లేదు. కుందుర్తి చూసిన నగరంలో వాన - హైద్రాబాద్‌ది. శ్రీశ్రీ ఆరుద్రలు ముందువాళ్ళ కావ్యాలు రాసి ఆ తర్వాత ఇతర దేశాలలోని మహా నగరాల్ని దర్శించారు. ఇది చాల ఆలస్యంగా జరిగింది. అజంతాకి మద్రాసు, హైద్రాబాదు తప్ప మరో నగరం ముఖం కూడా తెలీదు. ఎంతో ధైర్యాన్ని కూడదీసుకొని వృద్ధాప్యంలో భోపాల్ వెళ్ళొచ్చాడాయన! అదీ ఒంటరిగా ఓ సారి!! శ్రీశ్రీ ఆరుద్రలు దర్శించినవన్ని మనోనగరాలే. రోణంకి వారి గ్రంధాల సముదాయంలో, ఆ విదేశీ సాహిత్య పత్రికలలో చదవగా, చర్చించగా తెలిసిన నగర జీవితమే. అయితే రెండు ప్రపంచ యుద్ధాల చరిత్రను ఆకళించుకొని, రెండో ప్రపంచయుద్ధాన్ని దాని పరిణామాల్ని అనుభవంలోకి తెచ్చుకున్న ఆధునిక (కొంతలో కొంత మార్క్సియ) సాహిత్య సహాధ్యాయులు కాబట్టి నగర జీవితపు చీకటి కోణాలనించే ప్రగతిశీల, అభ్యుదయ కామన కల వెలుగు కిరణాల్ని చూడగలిగారు. 'సినీవాలి' అనే పేరు అందువల్లనే సార్థకం.

9. 'సినీవాలి' ఒక చంపూ కావ్యం. అయిదు భాగాలుగా ప్రవర్తిల్లింది. రెండో భాగంలోని తండ్రీ కొడుకుల సంభాషణ అతిపేలవమైన వచనంలో సాగింది. కాలేజి వార్షికోత్సవాల సమయంలో వేసే నాటకాల శైలిలో సాగింది. దానికి తగినట్టు గానే ఒక 'సేవకుడు' కూడ ఉంటాడు. ఒకటో అమ్మాయి రెండో అమ్మాయి, శ్రీమంతుడు అందరూ ఒకరి తర్వాత ఒకరు రంగప్రవేశం చేస్తూ కారికేచర్లుగానే మిగుల్తారు. 'సినీవాలి' ఒక సంఘటిత కావ్యం కాదనిపిస్తుందందుచేతనే అన్నీ ఎత్తు పల్లాలు. 'ఊహో సుందరి' కూడా చాల contrived గా సంభాషణ కొనసాగిస్తుంది.

'కల నిజ పరచడం కాదు కవిత్వం
నిజాన్ని కల గనడమే దాని తత్వం'
అన్న ఆరుద్ర ఆశంస చాల నీరుగారి పోయింది ఈ రెండో భాగంలో

అయితే ప్రథమ భాగంలో మాత్రం వచన పారాగ్రాఫుల్ని కంద, తేటగీతులతో alternate చేయటం వల్ల కొంత తూగువచ్చింది. ఇదే భాగంలో అంత్య ప్రాసలు కూడ పరిమితంగా ఉండటం మరొక విశేషాంశం.

10. బాదెలేర్ 'ఫ్లవర్స్ ఆఫ్ ఈవిల్' ని చదవకుండా ఏ తెలుగు కవీ నగర జీవన చిత్రణని చెయ్యలేడు. ఆరుద్ర తప్పక చదివే ఉంటాడు.

''పాడుతాను నాకు తెలిసిన నగరం గురించి
నగరంలో నాతి గురించి నీతి గురించి''
అన్న ఆరుద్ర చూచిన దృశ్యాలేమి?

నకిలీ ప్రకృతి దృశ్యాలు, కల్తీ ఉద్యానవనాలు, ఆవలించిన ఆఫీసులూ, రగ్గు కప్పుకొన్న కార్ఖానాలు, మతి చలించిన మోటారు సైకిళ్ళు, పట్టాలతో చెట్టా పట్టాలు వేసుకున్న ట్రాంబళ్ళు, స్వర్గ నరకాల సహజీవనం.

ఇంకా ఏం చూచాడయన? ఎండిపోయిన నదిలో పడవలు, మొసళ్ళు, ఎండిపోయిన నదిలోని పండుటాకుల గలగల!

'నీనగరం ప్రొద్దున్నే ఎదురొచ్చే

ప్రశస్తమైన విశ్వస్త ......
నగరం నిన్ను ఉంచుకొంటుంది.''

11) అజంతా ''రోడ్లకి నమస్కారం'' కవితలో నగర రహదారుల్ని స్త్రీశరీరపు వంపులుగా మలుపులుగా పడి నడవాల్సిన నడిచి పడిపోవాల్సిన ప్రమాద ప్రదేశాలుగా ఓ రూపక భావన చేసాడు. అందుకే రోడ్లకి నమస్కారం అన్నాడు కదా!

ఆరుద్ర - శ్రీరంగం నారాయణ బాబులాగనే - విశాఖపట్నం నల్లని తారురోడ్లు - నీగ్రో పిల్ల బుగ్గ అల్లిపురంని వర్ణిస్తో ఏమన్నాడో ఓసారి గుర్తు చేసుకోండి. (మూసపలి కావ్యం 'విశాఖపట్టణం' కూడ గుర్తుకొస్తుంది.)

ఆరుద్ర వర్ణన ఇది -
''నగరం నీలి నైలాను చీరల తారురోడ్లు ధరించాలి తారు రోడ్ల చీరల మీద
మోటారుల జలతారుకావాలి.

పానీయపుటంగళ్ళ ఖరీదైన శాఠీనులంగా ధరించాలి.''(విమెన్‌టాక్ ఆఫ్ మైకెలాంజెలో - అని ఎలియట్) ఆరుద్ర నగరం మెదడు తక్కువైన, న్యూలుక్కు బ్రా బిగించిన లోకట్ జాకెట్ తొడుక్కున్న నైటుక్లబ్బుల రంగేళీయువతి. పరిష్వంగ నృత్యంలో స్లో ఫాక్సు ట్రాట్ సంగీతానికి కళ్ళుమూస్తుంది. - 'నగరం కుడి కంట్లో పుసి. మలి కంట్లో కసి'. 'నగరంలో యామిని నరకంలో ఆమని'.

కావ్యంలోని ప్రథమ భాగంలోని బిగువంతా ఇక్కడితో ఆగిపోతుంది. (పుట 32. యం. శేషాచలం ప్రచురణ) ఇక సూర్యుడు - కథానాయకుడు ప్రవేశిస్తాడు. ఓ కంద పద్యంలో. (పు. 33)- చంచల, చపల అనే ఇద్దరు వనితలు కూడా ప్రవేశిస్తారు. వారి సందేహ సంశయుల్లోంచి సరైన దారిన పెడ్తామని సూర్యుడి ప్రయత్నం. అంతలో వింతగా ఒక అతి వృద్ధుడూ వస్తాడు - నర్తనశాలకు. యధేచ్ఛ వర్తనశాలకు. (ఈ వృద్ధుడు ఆల్ఫ్రెడ్ జె. ప్రూఫ్రాక్ కి నమూనా)

12) ప్రతి వర్తమాన కవీ పూర్వ కవి భుజాలమీద నుంచుని చూస్తాడనటానికి ఇక్కడే ఒక నిదర్శన.

సి. విజయలక్ష్మి 'శోకంలో అశోక సెలయం' అనే కవిత మహాస్వప్న కవిత 'గ్లాసెర్భవతి భారతి' కూడ.

రెంటాల గోపాల కృష్ణ కూడా అనలేదూ?
''వేయి కౌగిళ్ళలో నలిగి నలిగి
ఒరిగి పడుకున్న వేశ్యవాలు జడ నగరవీధి''

13) తారుణ్య హృదయంతో తర్కించుకొంటున్న 'సూర్యుడు'కి శాంతి దర్శనమిస్తుంది. ఇచ్చి అదృశ్యమై పోతుంది ఆ 'అమందానంద కర మూర్తి, నిర్మల శుభ సౌఖ్య నియతి, నిశ్చల విజ్ఞాన నిరతి'.

14. ఆ తదుపరి రాజకీయ ననంద్రశమైక జీవన సౌందర్యాన్ని, సమష్టి జీవన సౌఖ్యాన్నీ బోధిస్తుంది. అయినా ఈ 'సూర్యుడి' నవోద్గీ ధనెవడూ వినడు. ఇది అభ్యుదయ రచయితల వైఫల్యం.

15. అందుకని స్వగ్రామపు సంజ చీకటి వంటి పంజరంలోకి వెళ్ళి పోయాడు సూర్యుడు.

16. ఇక్కడ్నించే 'సినీవాలి' కావ్యం పలచనై పోవటం మొదలయింది. 'జీవితం రేడియో సెట్టుకి భర్త ఏరియల్ భార్య ఎర్తు' 'ద్వంద్వ సమాసంలో ఎంత అందం ఉందో' - లాంటి ఆరుద్ర మార్కు గిమ్మిక్కులలో. వెటకారం ఐరనీ కాదు. ప్రయోజన వాద కవిత్వంలో ఇలాంటి ప్రయోగాలేమిటో?

17. ఇక మూడో భాగంలో సూర్యుడు నగర పునః ప్రవేశం చేసి 'నగరమనే రద్దీ వ్యాపారి వద్ద నగలాంటి తన జీవితం తాకట్టుపెట్టాడు.' కొంతప్రణయం - పబ్లిక్ పార్కులో పబ్లిక్ బెంచీమీద పబ్లిక్‌గానే - టాక్సీ వెయిటింగ్ ఛార్జీలు పెరుగుతూంటే బాక్సీటులోనే తొందరగా ప్రేమమాటలు - ('వేస్టలాండ్‌లో' టాక్సీ!) ఈ భాగంలో పఠాభి మార్కు చెణుకులు విన్పిస్తాయ్ ఆరుద్రరచనలో ప్రణయమనే షవర్ బాత్ తర్వాతవైవాహిక జీవితమనే స్విమ్మింగ్ పూల్. నిబద్ధుడైన.కవి, నిమగ్నుడైన కవి **attitude** కీ **expenssion** కీ సమత్వం కుదలేదిక్కడ. ఈలోపం ఆరుద్రలోని చమత్కార ప్రియత్వం వల్ల కల్గిందే. శ్రీశ్రీ లో మాత్రం విచార ధార వినోద హేలలు వేరువేరుగా ఉంటై. ఆరుద్రలో ఆవింగడింపు కనపడదు.

18. 'సినీవాలి' నాలుగో భాగంలో కఠినవాస్తవికతకు మరల మళ్ళి వచ్చింది. ఎన్‌జీవో సూర్యుడు పెళ్ళయ్యాక, పదేళ్ళలో పాతికేళ్ళు గడిచినట్లయి 'దేవుడనే లాటరీ టికెట్టు కొన్నాడు.'

శాంతిని - 'నా పక్కన శయనించే ఈ మాజీ చక్కదనమెవ్వరు' అని అనుమానపడ్డాడు - బలవంతుడు, భగవంతుడి మధ్య పడి నలిగిపోయి.

19. ఇక ఐదవభాగంలో - ఉద్యోగం ఊడిన సూర్యుడు 'దూలం క్రింద వేలాడే కాలం తాడు మూడుపేటలుగా' నేస్తున్నాడు భూతభవిష్య వర్తమానాలతో.

20. కాని చివరికి ఆరుద్ర తనకావ్యాన్ని మంగళాంతమే చేసాడు. ఆశాచంద్ర కళగల సినీవాలిగా.

**"I labor, I spend, I strive, I design, I love, I cling, I uphold, I give away, I envy, I long, I scorn, I die, I hide, I want" (Seize the Day - Saul Bellow)** అంటూ నగర జీవి నరకంలో మినుకుమినుకు మంటూ మనుకుతూనే ఉంటాడయినా.

# హాల్డార్ లాక్స్‌నె

## నోబెల్ బహుమతి ఉపన్యాసం, 1955

అనువాదం : సి. విజయశ్రీ

నేను కొద్ది వారాలక్రితం, దక్షిణ స్వీడన్‌లో పర్యటిస్తుండగా, స్వీడిష్ అకాడమీ పురస్కారానికి నేను ఎంపిక కావచ్చునసే విషయం పుకారుగా వినవచ్చింది. ఆరాత్రి, ఏకాంతంలో హోటలు గదిలో నాలో ఓ ప్రశ్న తలెత్తింది. 'ఈ ప్రపంచంలోని సుదూర ద్వీపానికి చెందిన ఓ రచయితకి, ఓ సామాన్య దేశదిమ్మరికి, ఈ విధంగా సంస్కృతీ ప్రోత్సాహానికి ప్రతిష్ఠ వహించిన ఓ సంస్థ పురస్కారానికి అకస్మాత్తుగా ఎంపిక కావడం, ఆ సంస్థ ఆదేశాను సారం ఇలా, ఈ వేదికకి రప్పింపబడడం యొక్క అర్థం, పర్యవసానం ఎలా వుంటుంది'.?

వెనువెంటనే ఆనాడు ... నేడు ఈ గంభీర క్షణంలోనూ నా ఆలోచనలు గతంలోని నానేస్తాలు,నేడు కనుమూసి మరపులో మరుగై పోయిన నా స్నేహితులు, బంధువుల వైపుకి మళ్లాయంటే వింతేమీ లేదు. ఈ వ్యక్తులు, వాళ్ళ జీవితకాలంలో కూడా కొద్దిమందికి మాత్రమే పరిచితులు, ఈ నాడు బహుకొద్ది మంది మాత్రమే వారిని ఎరుగుదురు. ఏమైనా వీరే నన్ను తీర్చిదిద్దిన వారు; నన్ను ప్రభావితుడ్ని చేసినవారు. నా మీద మరే మహానుభావుల, పథనిర్ణేతల ప్రభావం పడనంత గాఢంగా, వీరి ప్రభావం పడిందని చెప్పాలి. నేను పెరిగిన నా సమాజంలోని అద్భుతమైన వ్యక్తుల గురించి నేను ప్రస్తావిస్తున్నాను ... నా తండ్రి, నా తల్లి, అందరికంటే ఎక్కువగా నేను అక్షరాలు కూడా నేర్వక ముందే వందలాది పంక్తుల ఐస్‌లాండ్ కవిత్వాన్ని నాకు నేర్పిన నా పితామహి నాకు గుర్తు వస్తున్నారు.

నా హోటలు గదిలో ఆనాటి రాత్రి ... ఇప్పుడు ఈ క్షణంలోనూ నేను ఆమె నాలో నాటిన నైతిక విలువల గురించే ఆలోచిస్తున్నాను. ఏ జీవికీ ఎన్నడూ హాని తలపెట్టరాదనీ, జీవితాంతమూ బీద, బడుగ, బలహీన వర్గాల నందరికంటె అదికంగా అభిమానించమనీ, అవమానితులనీ, బాధితులనీ మరవవద్దనీ, అలాటివారు ఐస్‌లాండ్ లోనే కాదు యావత్ప్రపంచంలోనూ మన మన్ననకీ, అభిమానానికి పాత్రులనీ ఆమెనాకు నేర్పింది. నేను నా శైశవం గడిపిన పరిసరాల్లో విశ్వవిఖ్యాతులు కథా పుస్తకాల్లోనూ, కలల్లోనూ తప్ప నాకెక్కడా తారసపడలేదు. సాధారణమైన దైనందిన జీవితం పట్ల, సామాన్యప్రజానీకం పట్ల ప్రేమ, మన్నన ... ఇదే నేను చిన్ననాటి నించీ దృఢ విశ్వాసంతో తల దాల్చిన నైతిక సిద్ధాంతం.

ఈ ప్రపంచ పుటల్లో కన్పించని నా స్నేహితుల పేర్లు నేనిప్పుడు స్మరిస్తున్నాను; వీరే నా సాహితీ జీవితంలో వివిధ దశల్లో నాకు మార్గదర్శకు లైనారు. వారు స్వయంగా రచయితలు కాక పోయినా, అమోఘమైన విమర్శనా శక్తి గలవారు. వారి వలననే, నేను సాహిత్యంలో ఎన్నో ప్రధాన విషయాల్ని గుర్తించ గలిగాను. ఆ అరుదైన వ్యక్తుల్లో చాలామంది ఈనాడు మన మధ్య లేరు. కానీ వారిస్మృతులు

నాలో ఎంత విస్పుటంగా వున్నాయంటే, చాలాసార్లు నా ఆత్మ ప్రకాశానికీ, నాలో నిండిన నాస్నేహితుల కంఠధ్వనులకీ వ్యత్యాసం నేనే గుర్తించ లేను.

నూట యాభైవేలమంది పుస్తక ప్రియులైన స్త్రీ, పురుషులతో కూడిన ఐస్‌లాండ్‌సమాజాన్ని కూడా నేనిపుడు గుర్తుచేసుకుంటున్నాను. ముందునించీ, నాదేశస్థులు నా సాహితీ జీవిత గమనాన్ని, జాగరూకతతో అవలోకించారు; అప్పుడప్పుడు విమర్శలతో, కొన్నిసార్లు పొగడ్తలతో! అంతేకానీ, నా కలంనుంచి వచ్చిన ఏ ఒక్క పదాన్ని వాళ్లు ఉపేక్ష చేయలేదు. ప్రతిచిన్న శబ్దాన్నీ అభిలేఖించే ఓ సున్నితమైన పరికరంలాగా వారు నేను వ్రాసిన ప్రతిపదాన్ని ప్రసన్నతతోనో, అప్రసన్నతతోనో గమనిస్తూనే వున్నారు. శతాబ్దాలుగా కవిత్వ సాహితీ సంప్రదాయ తప్తమైన దేశంలో జన్మించడం ఓరచయితకి అరుదైన అదృష్టం.

నా ఆలోచనలిప్పుడు పురాతన ఐస్‌లాండ్ కథకులు, మా ప్రామాణిక గ్రంథకర్తల వైపు పరుగులు తీస్తున్నాయి. ఈ మహాత్ముల వ్యక్తిత్వాలు సామాన్య ప్రజానీకంలో ఎంతగా విలీనమై పోయాయంటే, నేడు వారి రచనలే కాని, వారిపేర్లు తదుపరి తరాలకు మిగలలేదు వారు వారి అమర గ్రంథాలలో చిరాయువులైయున్నారు; ఐస్‌లాండ్ ప్రకృతిలో భాగమై నిలిచి యుంటారు. చీకటి మయ శతాబ్దాల్లో, అజ్ఞాతులైన ఈ స్త్రీ పురుషులు వారి మట్టి గుడిసెల్లో మహాగ్రంథాల్ని రచించారు. తమరచనలకి వేతన మేమని వారు ప్రశ్నించలేదు. ఏలాటి గుర్తింపునీ, పురస్కారాన్ని వారు కోరలేదు. అతి దయనీయమైన పరిస్థితుల్లో, కొయ్యబారిన వేళ్లను వెచ్చబెట్టుకోను నిప్పుకూడా లేని స్థితిలో, నిశీధి వేళల్లో వాళ్లు గ్రంథాలు రచించారు. అయినప్పటికీ, అత్యంత మధురమైన, సూక్ష్మమైన సాహితీ భాషనే కాక, విలక్షణమైన సాహితీ ప్రక్రియలనికూడా వాళ్లు సృష్టించారు. వారి హృదయాల వెచ్చదనంలో వారి కలాలు వేడిమి సంతరించుకున్నాయి.

స్టాక్‌హోంలో, నాహోటలు గదిలో కూర్చొని యుండగా, నన్ను నేనిలా ప్రశ్నించుకున్నాను. ''కీర్తి, విజయం ఓ రచయితకేమిసాధించి పెడతాయి?'' డబ్బుతోవచ్చే భౌతిక సుఖమా? నిస్సందేహంగా! కానీ, ఓ ఐస్‌లాండ్ కవి ప్రజాకవిగా తన యునికిని మర్చిపోతే, బడుగు, బలహీన ప్రజలతో తన వారసత్వాన్ని, వారిపట్ల తన తాతమ్మ నేర్పిన గౌరవాన్నీ, భాద్యతనీ విస్మరిస్తే, ఈ కీర్తి వల్లా, సంపదవల్లాతనికి కలిగే ప్రయోజన మేముంటుంది.

అధినేతలారా! సదస్యులారా! నా పేరుని ఈ విధంగా అజ్ఞాత కథాకారుల పరంపరలో చేర్చిన ఈ స్వీడిష్ పురస్కారాన్ని నా జీవితంలో ఓ గొప్ప సంఘటనగా నేను భావిస్తున్నాను. అకాడమీ అసామాన్యమైన రీతిలో నన్నీ పురస్కారానికి ఎంపిక చేసినందు కిచ్చిన కారణాలు, నాకు రాబోయే రోజుల్లో ప్రోత్సాహ కారకాలుగా వుంటాయి. అంతేకాక నా కృషి సాఫల్యానికి దోహదకారులైన వారందరికీ సంతోష ప్రదాయకమవుతాయి. మీరు నా కందించిన ఈ పురస్కారంతో నాలో ఆనందాతిశయాలు నిండి పోతున్నాయి. కృతజ్ఞతతో, మన్ననతో స్వీడిష్ అకాడమీకి నా అభివందనలు తెలుపుకుంటున్నాను. ఈనాడు, ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నది నేనైనా, ఈ సన్మానం నా గురువులైన ఐస్‌లాండ్ సాహిత్య సంప్రదాయ జనకులందరికీ చెందుతుందని నేను భావిస్తున్నాను.

# సాహిత్యంలో సైన్స్ టెక్నాలజి

- నాగసూరి వేణుగోపాల్

నేడు సైన్స్ టెక్నాలజి అనేవి చాలా విడదీయరానంతగా మనతో ముడిపడివున్నాయి. మరి అటువంటి సమయంలో తెలుగుసాహిత్యంపై సైన్స్‌టెక్నాలజి ప్రభావం ఏమిటి? ఈ ప్రశ్న ఎంతో అర్థవంతంగావున్నా, జవాబు రెడీమేడ్‌గా దొరకదు. ఇటీవలి కాలంలో కొందరు పరిశోధక విద్యార్థులు యిటువంటి అంశాలమీద రీసర్చి మొదలెట్టారు. దీని గురించి తరచు అడగటం గానీ, రాయడంగానీ జరుగుతోంది. అందుకే ఈ విషయం గురించి ఆలోచిద్దాం!

## సైన్స్, టెక్నాలజి వేరు వేరా?

ఒక ఇంజనీరు మొదట యింటికి సంబంధించి ప్లాను గీస్తాడు. తర్వాత భవన నిర్మాణం సాగుతుంది. ఇక్కడ ఇంటికి సంబంధించిన ప్లాను, ఇల్లు ఒకటికావు. ఒకటి శుద్ధమైన భావన, సిద్ధాంతం, సూత్రం, అయితే మరోటి అనువర్తితం. ఒకటి సైన్స్ అయితే, మరోటి టెక్నాలజి అవుతుంది. టెక్నాలజికి సైన్స్ మూలం. సైన్స్ ఆధారంగా టెక్నాలజి మలచబడుతుంది. అలాగే అటంబాంబుకు సంబంధించిన ద్రవ్య, శక్తి మార్పిడి సూత్రం సైన్స్ అయితే ఆటంబాంబు టెక్నాలజి అవుతుంది.

సైన్స్‌సూత్రాలు ఉద్దేశ్యపూర్వకంగానో కాకతాళీయంగా ఆవిష్కరించబడవచ్చు. ఈ పరిశోధన ఆసక్తి ఆధారంగా, కృషిసాగుతుంది. దానికి బలమైన మరో కారణం లేకపోవచ్చు. ఉదాహరణకు శక్తి ఒక రూపం నుంచి మరో రూపానికి మార్చగలం గానీ, దాన్ని నాశనం చేయలేం అని ''శక్తి నిత్యత్వనియమం'' వుంది. అలాగే ద్రవ్యానికి సంబంధించి ''ద్రవ్య నిత్యత్వనియమం'' వుంది. మరి ద్రవ్యం, శక్తి పరస్పర మార్పిడి సాధ్యమవుతుందా అని ఆలోచన వచ్చి పరిశోధన సాగవచ్చు. లేదా ద్రవ్య మార్పిడిలో కొంత ద్రవ్యం తగ్గడంతో సందేహం కలిగి - యిలా ఏకారణంతోనైనా పరిశోధనాకృషి సాగవచ్చు. ఆస్థాయిలో అది ఏ రకంగా ఉపయోగపడుతుంది, ఎలా ఉపయోగపడుతుంది అనే మీమాంస వుండకపోవచ్చు. అందుకే కొందరంటారు శాస్త్ర పరిశోధనకు కేంద్ర బిందువు సమాజం గాదు, ఆసక్తి అని. అది కొంతవరకు నిజంకూడా కావచ్చు. అంటే సామాజిక ప్రయోజనం అన్నది ఈస్థాయిలో పూర్తిగా నిర్వచింపబడి వుండకపోవచ్చు.

## సైన్స్‌కన్నా టెక్నాలజికి జీవితంతో ఎక్కువ సంబంధం వుందా?

అయితే సైన్స్ పరిశోధనకు సంబంధించిన ఈవాదన టెక్నాలజి విషయంలో పూర్తిగా వర్తించదు. ఎందుకంటే ఏదైనా సూత్రం ఆధారంగా టెక్నాలజి రూపొందించడంలో మొదట ఆసక్తితో మొదలైతే అది ప్రయోగశాలస్థాయి దాటదు. అలాకాక భారీ ఎత్తున టెక్నాలజి రూపొందించబడినా, ప్రయోగశాల దాటి బయటికివచ్చినా - దానికి బలమైన సామాజిక కారణం వుంటుంది.

శక్తి = ద్రవ్యం X కాంతివేగం X కాంతివేగం

అనే సూత్రీకరణను సాపేక్షతా సిద్ధాంతంలో చిన్నఫుట్‌నోట్‌గా ఐన్‌స్టీన్‌రాచుకుని, ఋజువుచేసినపుడు - మానవాళిని పొట్టన బెట్టుకున్న హిరోషిమా బాంబు గురించి ఊహించి

వుండడు. అది కేవలం సైన్స్ స్థాయి. అయితే నాజీలు ఆటంబాంబును బలవంతంగా తయారుచేయించి, జపాన్‌మీద ప్రయోగించడం అన్నదానికి వెనుక బలమైన రాజకీయ, సామాజిక కారణం వుంది. అంటే టెక్నాలజి సమాజంలో నేరుగా ముడిపడి వుంది. అని చెప్పవచ్చు.

టెక్నాలజి అనువర్తితం కాబట్టి మన అవసరాలకు తగినట్టు దాన్ని రూపొందించుకోవడం జరుగుతుంది. అందువల్ల టెక్నాలజి, సైన్స్‌కన్న ఎక్కువ ముడిపడివుంటుంది.

## సైన్స్ ఎక్కువా? టెక్నాలజి ఎక్కువా?

ఒకటి విత్తనం, రెండవది కాయలాంటిది. ఫలాన్ని నేరుగా మనం వాడుకోవచ్చుని విత్తనాన్ని నిరాదరించగలమా? విత్తనం లేకుండా పండు వస్తోందా? ఇది వాస్తవం అయినా శాస్త్రజ్ఞుల స్థాయిలోనే దీనికి సంబంధించి అవగాహన సరిగాలేదు. అందుకే భాభా అటామిక్ రీసర్చి సెంటర్ **(BARC)** డైరెక్టరు పోస్టుకు ఫిజిక్స్ చదివిన వ్యక్తి కావాలా? టెక్నాలజికి సంబంధించిన వ్యక్తి కావాలా? అని రాజకీయాలు జరుగుతూ వుంటాయి.

మీకు నవ్వురావచ్చు. అంతపెద్ద శాస్త్రవేత్తలకు యింత చిన్న, మౌలిక సందేహంతో దెబ్బలాడుకోవడం ఏమిటి? అని నిజానికి మనం మాయ విషయాల్లోనే స్పష్టత లేకుండా సమస్యలకు లోనవుతూ వుంటాం.

ఇది ఒక పార్శ్వం కాగా, టెక్నాలజితో నేరుగా ధనాన్ని సంపాదించవచ్చు. ఇప్పుడు అంతరిక్షంలో ఉపగ్రహాలను మనం ప్రవేశ పెట్టగలుగుతున్నాం. ఈ సామర్థ్యాన్ని మనం యిటీవలే సాధించాం. ఇంతవరకు మన ఉపగ్రహాలు యితరదేశాలు అంతరిక్షంలో ప్రవేశపెట్టినందుకు ఒక్కొసారి **40,50** కోట్ల రూపాయాలు వెచ్చించేవారం. అయితేనేడు మనం ధనాన్ని పొందేస్థితిలో వున్నాం. అంటే టెక్నాలజి ఆదాయంగా మారుతోందన్నమాట. సైన్స్ స్థాయిలోనే రాబోయే టెక్నాలజి ఆదాయాన్ని కోరుకునేనేడు పేటెంట్లు అంటూ శాస్త్రవేత్తలు ఎగబడుతున్నారు. అంటే దేనివల్ల అయితే ఆదాయం వుందో, దానికి ప్రాధాన్యత యివ్వడం మనబలహీనత. తల్లిసైతం సంపాదించే కొడుక్కే ప్రాధాన్యత యిస్తుందట!

## దీని ప్రభావం ఎక్కడ?

టెక్నాలజి ప్రభావం సామాజికంగా వుంటే సైన్స్ ప్రభావం సామాజికంగానే దృక్పథం స్థాయిలో వుంటుంది. టెక్నాలజి వాడకంలో సామాజిక బాధ్యత, నైతిక సూత్రాలు ప్రముఖంగా వుండాల్సినా, అలా వుండడం లేదు. ఈ కారణంతో టెక్నాలజిలో సమస్యలు వస్తున్నాయి. అందుకే ''టెక్నాలజి ఎథిక్స్'' అవసరం. బిజినెస్ ఎథిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఎథిక్స్ అనే విభాగాలు వృద్ధిచెందుతున్నట్టు అదికూడా వృద్ధిచెందాలి.

సైన్స్ అన్న సూత్రీకరణలు పరిశోధన, ప్రయోగం, భావన, సిద్ధాంత భూమికలుగా తయారవుతాయి. ఏ రకంగా పరిశీలించాలో ఎందుకు పరిశీలించాలి? అలానే ఎందుకు పరిశీలించాలి? వంటి అంశాలు చర్చకువచ్చినపుడే ''శాస్త్రీయ దృక్పథం'' చర్చింపబడుతుంది. కేవలం ఈ కారణంగానే మూఢనమ్మకాలు, అశాస్త్రీయ దృక్పథం ముందుకొస్తున్నాయి.

చాలా మంది శాస్త్రవేత్తలు ఎంత పరిశోధనచేసినా యిటువంటి మౌలిక అంశాల గురించి

అవగాహన లేకుండా వుంటారు. సమాజంలో చాలారంగాల్లో వున్నట్టే యిక్కడసైతం చేసేపని కేవలం ఉదరనిమిత్తం తప్పా మరోస్థాయిలో అందుకోడు. అందుకే సూర్యుడు, చంద్రుడు, రాహువు, కేతువు భూమి చుట్టు తిరుగుతాయని నమ్ముతూ, ప్రయోగశాలలో సూర్యుడు గ్రహంకాదు, చంద్రుడు ఉపగ్రహం. రాహుకేతువులు అసలులేవు అని పరిగణిస్తాడు.

## మరి సమాజం దీన్ని అర్థం చేసుకుంటుందా?

శాస్త్రవేత్తలే ఖాతరు చేయని ఈ అంశాలను సామాన్య ప్రజనీకం అందుకుంటుందా? అర్థం చేసుకుంటుందా?

ఇంత ప్రాధాన్యత గలిగిన వీటి గురించే స్పష్టమైన అవగాహన లేనపుడు సాహిత్యంపై వీటి ప్రభావం గురించి ఆలోచించగలమా?

భావనలే స్పష్టంగా నిర్వచించుకోలేనపుడు దానివల్ల కలిగే ప్రభావాలను గమనించి, దాని ఛాయలను జీవితం మీద పసిగట్టగలమా? అలాంటి ఛాయలను సాహిత్యకారులు సరిగా చిత్రించగలరా? అసలు చిత్రించగలరా? లేదా అలా చిత్రించే ప్రయత్నం చేయగలరా? మరి అటువంటి సందర్భంలో సైన్స్ ఫిక్షన్ పాత్ర ఏమిటి?

అందుకే తెలుగు సాహిత్యం పై సైన్స్, టెక్నాలజి ప్రభావం అంటూ చర్చించుకోవాలని అనుకునే ముందు మరింత మౌలికంగా పరిశీలించాలి. వీటి ప్రభావం గురించి మాటాడేముందు తెలుగు సాహిత్యంలో సైన్స్, టెక్నాలజిల గురించి శోధించాలి.

## గందరగోళం వద్దు!

సాహిత్యంలో సైన్స్‌కూ, పాపులర్ సైన్స్‌కూ గందరగోళం వద్దు. పాపులర్ సైన్స్‌లో ఉద్దేశ్యం షాహిత్యం కాదు, సైన్స్. సైన్స్ గురించి తెలియజెప్పటానికి చేసే ప్రయత్నం పాపులర్ సైన్స్. ఇది ఎంత ఆకర్షణీయంగా రూపొందించాలని అసలు సైన్స్‌కే గందరగోళం రావచ్చు లేదా నాన్-సైన్స్, నాన్సెన్స్ తయారుకావచ్చు.

కానీ, సాహిత్యంలో సైన్స్ అన్నది యిది కాదు. సాహిత్యకారుడి సాహితీ సృజనతో ఈ సైన్స్ టెక్నాలజిలో ముడిపదార్థాలుగా ఎలా వున్నాయి? లేదా సాహిత్య సృజన మరింత అర్థవంతమవుతుందా? లేదా దానికి దోహదపడుతుందా? అని ఆలోచించాలి.

అసలు శాస్త్రవేత్తలలోనే భావ గందరగోళం వుంటే కల్పనల మధ్య తేలియాడే కవులు, రచయితలు ఈ సున్నితత్వపు స్పష్టతలను అందుకోగలరా? ఆ రకంగా సృజించబడ్డ సాహిత్యాన్ని పరిశీలించే వ్యక్తి యింకెంత జాగురూకతతో వ్యవహరిస్తూ వుండాలి! ఎంత భావనావేగం కలిగివుండాలి? దీన్ని బేరీజు వేసే షరాబులు యింకా బయలుదేరాల్సి వుంది!

రెండు రకాలుగా వివరించడమే కాక, మొదటి తెలుగుసాహిత్యంలో సైన్స్, టెక్నాలజి ఏమిటి, ఎంతో అర్థంచేసుకుంటే తరవాత వాటి ప్రభావం గురించి ఆలోచించే అవకాశం కల్గుతుంది.

# సూతపురాణంలో శ్రీకృష్ణుడు

- రావెల సాంబశివరావు

పురాణ పురుషుడయిన శ్రీకృష్ణుని అవతారం సూతపురాణంలో ఎలా వుందో ఒకింత చూద్దాం-

''ఆటలనాడినాఁడవు లందున నావుల మేపు చుండి స
య్యాటల నాడినాఁడు కొమరాంగ్రనలు గూడి మనోహరంబుగాఁ
బాటల పాడినాఁడు పసివాడిన మోళ్ళు చిగుర్పఁగా జగ
న్నాటక సూత్రధారుఁడయినాఁడెతడో యాతనిందలంచెదన్''

సూతపురాణం ముగింపు పద్యంలో పేర్కొన్న అటువంటి కృష్ణుని తలచుకుంటూ ముందుకు సాగుదాం.

పురాణాల కొలతల ప్రకారం శ్రీకృష్ణుని కాలం ద్వాపరయుగం. ద్వాపరయుగ లక్షణాలను కవిరాజు గారు ఈ విధంగా వివరించారు.

''ద్వాపరమున నూతన ధర్మపీడలు వెలువడినవి. రాజ్యతృష్ణ విపరీతముగ బెంపొందినది. శంతనుఁడు జ్యేష్ఠభ్రాతయయినదేవాపిని రాజ్యభ్రష్టునిగావించి, యడవులకంపితాను రాజయ్యెను, వీని సంతతియైన కురుపాండవులు కుడిచి కూర్చుండ నొల్లక పాళ్ళు కుదురక తాము కొట్టుకొని చచ్చుటయే గాక ఖండమునంతయు రక్తప్లావితముజేసి, భారత దేశమున దరిద్ర దేవతను దాండవింపజేసిరి.'' మరి ఈ దారిద్ర్యంలో శ్రీకృష్ణుని పాత్రయేమాత్రమో తెలుసుకుందాం.

మహాభారత గుణగ్రహణ పారీణులైన పెద్దలకు ఇది కొంత విడ్డూరముగా కన్పించవచ్చు. అందుకే కవిరాజు ముందుగానే జాగ్రత్తలు చెప్పినాడు.

''సంస్కృత గ్రంథములను వెనుకముందు బిరుదులు తగిలించుకొన్నయట్టి వారెవ్వరో వ్రాసిపెట్టిరని చెప్పి యీ గ్రంథములయందు వాకొనబడినదంతయు ధర్మమని భ్రమ ప్రమాదమునకు లోనుగాకుము. ''తద్భాష యందేమి చెప్పబడినను అది పరమ పవిత్రమని భావింపబని లేదు.'' అందువలననే-

''పురాణము లెంతవఱకు ఁ బ్రతికూలములో, ఎంతవఱకు నీతి బాహ్యములో, యెంతవఱకు ఁ బక్షపాత భూయిష్ఠములో మోడ్పుగన్నుతో నున్న విద్వల్లోకమునకు జూపించు తలంపుతో సూతపురాణము రచింపబడినది. తత్కారణమున సూతపురాణము కారణజన్మ.'' అందుకే-

''ఈ కథ వ్రాసిన విన్నను
వాకొన్నను బాడిపంట పరువము నుబ్బున్
తేకువజోకయు ఁ బ్రబ్బున్
బ్రాకటముగ లిబ్బు లుబ్బు ఁ బైరము లబ్బున్''

---

★ **రావెల సాంబశివరావు**, నాగార్జున విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగా పనిచేస్తున్నారు.

''బూతు పురాణము గాదిది
ప్రాత పురాణమును గాదు పాతకహరమౌ
సూతపురాణం బియ్యది
పూత పురాణంబు పుణ్య పురుషావళికిన్''

ఈ చెప్పేదంతా ఏదో వింతగా వున్నదనుకుంటే ఏమి చేయగలను. మళ్ళీ కవిరాజుగారి పద్యమే వినిపిస్తా-

''కొందఱు సత్యము మెత్తురు
కొందఱు సత్యంబు మెచ్చుకొను చుందురిఁకన్
కొందఱు రెండున్ మెచ్చెద
రందఱి మెప్పింప సాధ్యమగునే నాకున్''

అందువల్లనే పురాణాలు చదివిన కొలదీ పెరిగే సందేహాలను సూటిగా సూతుని ద్వారానే నివృత్తిచేసుకోవాలని ప్రయాణమైపోయి చిరకాల జీవియగు సూతుని గంగానదీ తీరంలో కలుసుకున్న కవిరాజుతో ముందుగా సూతుడేమని చెప్పాడు? -

''వ్యాస భట్టారకుఁడు మున్న వచ్చిచెప్పె
శిష్యుఁడొకడు విద్యార్థియై చేరఁగలడు
వాని ధర్మసందేహము ల్బాపి పంపు
మఖిల లోకైక కల్యాణ మగునుదాన.''

'లే నాయనా! లే! నీ సందేహాలకు సమాధానాలు విందువులే'. అని మేనునిమిరి దగ్గరగా కూర్చుండబెట్టుకొని సౌమ్యమైన కంఠస్వరంతో-

''నా పేరన్ వెలయించి నా మెడకు నంటంగట్టి తద్గ్రంథముల్
నా పై నేరము మోపుచు 'దలచి యన్యాయంబు న్యాయంబుగాఁ
బాపంబున్ సుకృతంబుగాఁగ రచియింపం జాలినా రెవ్వరో?
నా పైఁబెట్టిన యట్టి యీ యగడు మాన్పంగాఁ బ్రయత్నించెదన్''

అంటూ సత్పాత్రుడు దొరికాడనే సంబరంతో, కారుణ్యంతో, శిష్యవాత్సల్యంతో ధర్మాల్ని స్పష్టంగా వినిపిస్తూ సందేహాలకు సమాధానాలు చెప్తూ-

''వినువారలున్నఁగథలన్
వినుపించెడివారు గల్గ విస్మయ మగునే?
వినికని చక్కఁగ నిజమును
గనుగొనగా వలయుఁగాని కాదనకుండన్'' అని హెచ్చరికలూ సూతముని చేయటం జరిగింది.

స్వర్గలోకాన్ని గురించీ, అయోనిజుల గురించీ, యదార్థ ప్రహ్లాదచరిత్రనూ, యదార్థ రామాయణాన్నీ సూతముని ద్వారా తెలిసికొన్న రామస్వామిగారు కృష్ణపోకిళ్ళలోని నిజం

తెలిసికోవాలనుకొని - "శ్రీకృష్ణ చరితంబుఁ జెప్పవే సర్వంబు/ పుట్టు పూర్వములన్ని పొందుపఱచి"
అని అడిగితే అందుకు సూతమర్షి ఎంతో ఉత్సాహంతో చెప్పుకు పోయాడు.

ముందుగా కృష్ణుని తండ్రిని గూర్చి చెప్పిన పలుకులు విందామా-

"వినుము వసుదేవుడు కులము పెద్దయయ్యె
సకల యాదవ వార్ష్ణేయ జాతులకును
నతి పురాతన సంప్రదాయమ్ము చేతఁ
గాని బాహుబుద్ధి బలమ్ము కలిగికాదు."

"వైరి సంహతిఁగడ తేర్ప బలములేక
దేశము జయింపఁ దంత్రముల్ తెలియలేక
యౌర! పదుముగ్గురను బెండ్లియాడెనాతఁ
డొండు తోఁచక యూరకే యుండలేక."

భారతం కాలం నాటికి పెండ్లిండ్ల మూలకంగా ఆర్యులకు ద్రావిడులకు చుట్టరికం బాగా పెనవేసుకుంది. వసుదేవుని చెల్లెలు, కుంతిభోజుని పెంపుడు కూతురు పృథ (కుంతి) పాండురాజును పెండ్లాడింది. అర్జునుని భార్యలు - చిత్రాంగద, ఉలూచి, సుభద్ర - ముగ్గురూ ద్రావిడ కన్యలే. దాశరాజు కూతురయిన సత్యవతి శంతనుడి భార్య, భీముడు హిడింబను గాంధర్వ పద్ధతిన పెండ్లాడాడు.

చుట్టరికాలు యిలా వుండగా జరాసంధుడు మగధరాజ్యాన్ని ఏలుతున్నాడు. ద్రావిడ రాజుల్ని కూడగట్టి ఆర్యుల్ని దేశంనుండి తరిమేందుకు రంగం సిద్ధం చేసాడు. చేది దేశప్రభువు శిశుపాలుడు, మార్తికావత పురరాజు సాళ్వుడు, పౌండ్రక దేశ ప్రభువు పౌండ్రక వాసుదేవుడు జరాసంధుని పక్షమే. మధురాధి నాథుడు కంసుడు జరాసంధునికి అల్లుడు.

అదిగో సరిగ్గా ఆ సమయంలో మహామాంత్రికుడయిన శ్రీకృష్ణుడు అవతరించాడు. కథ తలక్రిందులైంది. ఒక విధంగా వ్రాయదగిన భారత చరిత్ర వేరే విధంగా వ్రాయవలసి వచ్చింది.

యాదవులు, వార్ష్ణేయులు, భోజులు, అంధకులు, సాత్వతులు, దశార్హులు అనే తెగలు అప్పుడు మధురలో మనుగడ సాగిస్తున్నాయి. అవన్నీ ద్రావిడ జాతి తెగలే. శ్రీ కృష్ణుడు మధురలో పుట్టింది యదుకులంలో తలిదండ్రుల్ని చెరసాలలో పెట్టించి పుట్టాడు.

"... ... ....
చెలఁగు దేవకి ప్రసవించెఁజిన్ని కృష్ణు
చొంగ ప్రొద్దున నెల్లరు దొంగినపుడు
కావుకావంచు మార్మ్రోగెఁగార యెల్ల"

భక్తులు కావు కావుమంటే వారిని బ్రోచే భగవత్ స్వరూపుడు పుడుతూనే కావు కావు మని ఎందుకు అరిచాడో ఆ భగవంతుడికే తెలియాలి!

''యాదవుండయ్యె యదువంశమందు (బుట్టి
గోపకుని యింట వర్ధిల్లి గొల్ల(డయ్యె
దానిచేత గోపకులు యాదవులు గారు
యాదవులు గోపకులు గారరసి చూడ''

మరి యీ యాదవులెవరు? ఈ విషయంలో పురాణాలు ఏమి చెప్తున్నాయ్?

యయాతి చంద్రవంశపు సార్వభౌముడు. అతని పెద్దకుమారుడు యదువు. యదువు అతని ముగ్గురు తమ్ముళ్ళు తండ్రి చెప్పిన మాట విననందున చక్రవర్తులు కాలేదట! కడగొట్టు కొడుకు పూరుడు తండ్రి మాటకు జవదాటలేదట. అందువల్ల చక్రవర్తి అయ్యాడట. ఇందులో అసలు కిటుకేమిటంటే-

యయాతికి ఇద్దరు భార్యలు. పెద్దభార్య దేవయాని రాక్షసుల గురువు శుక్రాచార్యుని పుత్రిక. యయాతి చంద్రవంశ క్షత్రియుడు. శుక్రాచార్యుడు బ్రాహ్మణుడు. కనుక వీరిది ప్రతిలోమ వివాహము. వీరికి పుట్టినవారు సూతులుగా పరిగణింపబడ్డారు. అందువల్లనే యదువు చక్రవర్తి కాలేదు.

యయాతి రెండవ భార్య శర్మిష్ఠ. ఈమె తండ్రి వృషపర్వుడు దానవేంద్రుడు. ద్రావిడ ప్రభువులను భారత కాలమునాడు క్షత్రియులుగానే లెక్కగట్టేవాళ్ళు ఆర్యులు. అందువల్లనే యయాతి శర్మిష్ఠల వివాహం సవర్ణ వివాహం. కనుకనే శర్మిష్ఠ కుమారుడు పూరుడు యయాతి తరువాత చక్రవర్తి కాగలిగాడు. ఈ పూరుడే కౌరవ పాండవులకు మూలపురుషుడు. యదువు యదు, వృష్ణి, భోజాంధికాది జాతులకు మూలపురుషుడు.

భాగవతం ప్రకారం యదువంశీయులు మ్లేచ్ఛజాతివారు. వసుదేవుని మూడవతమ్ముడు అనాధృష్టి. అతని కుమారుడే ఏకలవ్యుడు. బ్రహ్మపురాణం ప్రకారం ఈ ఏకలవ్యులు ''నైషాది'' అనగా ఆటవికులయిన కిరాతాది జాతులలోని వారు. ఇటువంటి యదువంశంలో శ్రీకృష్ణుడు జన్మించాడు. దీనికి తార్కాణమో?

''కిట్టని మాటయౌనె? యొకకేలను వేణువు గల్గ( మౌళిపై
నట్టువ పిట్ట కుంచియ కనంబడు చుండ(గ( జెంచువారిలో
జుట్టరి కంబుగల్గంగడు( జొక్కపు నల్లని మేని చాయక
వ్పట్ట(గ జెంచు కాడనుచు వాకొన సత్య విరుద్ధమే కదా!''

సరే యీ విషయాన్నిలావదిలి ముందుకు పోదాం-

యదు వృష్ణి భోజాంధికాది జాతులయందు భోజవంశము రాజవంశము. ఈ జాతులను పరిపాలించుహక్కు భోజులకు మాత్రమే కలదు. కంసుడు భోజులకు ప్రభువు. అందువల్ల యదు, వృష్ణి భోజాంధకుం కెల్ల ప్రభువే. భోజులు అధిక సంఖ్యాకులు. రాజవంశమువారు. సార్వభౌముని బంధువులు. అందువల్ల భోజులకు యదు, వృష్ణి తెగలపట్ల చిన్నచూపు. కనుకనే యదు,వృష్ణి తెగలకు, భోజాంధక తెగలకు సరిపడదు.

కంసుడంటే భయపడే దేవకీ వసుదేవులకు కారాగారంలో చిన్నికృష్ణుడు జన్మించాడు. మేనల్లుణ్ణి కంసుడు చంపుతాడనే భయంతో వసుదేవుడు కృష్ణుణ్ణి పుట్టిననాటి నడిరేయినే నందుని యింట యశోద ప్రక్కలో వదలి ఆమె కుమార్తెను తెస్తే ఆ బిడ్డను కంసుడు చంపినట్లు కథ.

శ్రీకృష్ణుని పెంపుడు తండ్రి నందుడు రాజపట్టణానికి దగ్గరగా వుంటే ముప్పువస్తుందని బృందావనానికి వలస వెళ్ళాడు. శ్రీకృష్ణుని యవ్వనంలో చాలాభాగం బృందావనంలో గడిచిపోయింది. గోపప్రభువు నందునికి లేకలేక కలిగిన సంతానంగా చెలామణీ అవుతున్న శ్రీకృష్ణునిలో విచ్చలవిడితనం పెచ్చరిల్లింది. ఆకతాయితనం పెరిగింది. ఎదురైనవాణ్ణి తొడగొట్టి సవాలుచేసే మల్లుడయ్యాడు. సరే ఇక చోరత్వము, జారత్వము సంగతి చెప్పేదేమున్నది?

నందుని యింట పెరిగి పెద్దవాడవుతున్నా కృష్ణుడు తన వంశాచారాలనూ, సంప్రదాయాలనూ విస్మరించలేదు. ఆటవికుల సామాన్య శిరోలంకారమైన నెమలి పింఛం నెత్తిపై ఉయ్యాలో జంపాలో అంటూ ఊగుతూనే వుండేది. ఆపై పిల్లనగ్రోవిని పుచ్చుకొని కనుబొమ లెగరవేస్తూ మునివ్రేళ్ళతో మురళిమ్రోయిస్తూ గోపికా జనాన్ని చిందులు త్రొక్కించేవాడు.

రాధ కృష్ణుని సయ్యాట కత్తె. పసుల కాపరు లందరి చెలిమికత్తె.

''గృష్ణునకు రాధమయమయ్యె నీజగంబు
పగలు రేలను భేదంబు పాసిపోవ.''

''రాధికా చకోరాక్షి నేత్ర యుగమునకు
నొండు గనరాదు శ్రీకృష్ణుడొకడుదక్క''.

ఇక ఈ రాధ పొదుపరి తనాన్ని వర్ణించే సమయంలో కవిరాజు అంతకు ముందు పురాణాలు వ్రాసినవాళ్ళ తలదన్నారు.

''మిట్టు గబ్బి గుబ్బల మొనలో మీటి చింపు
ననుచుఁ జనుకట్టును దొడిగికొనుటమాని
పైఁట చెఱఁగున జొమ్ముల పట్టుఁగప్పుఁ
బుట్టి యెఱుఁగ బోమిటువంటి పొదుపులాడి.''

ఈ రాధగాక కృష్ణుని మేనత్త, నందుని చెల్లెలు అయిన వేరొక రాధగలదు. నామ సామ్యంవల్ల భక్తకోటి ఇరువుర్నీ ఒక్కటిగా చేసేసారు. అందువల్ల సయ్యాటకత్తె మహాభక్తురాలిగా, కృష్ణుని పరీతత్వము కనిపెట్టిన జాణగా కొనియాడబడింది.

బృందయందలి ఈ స్వేచ్ఛాజీవనమే శ్రీకృష్ణుని భవిష్యత్తులో రాజకీయ రంగంలో ఎదురులేని వాణ్ణిగా చేసింది. వాడియైన బాణములతో కాని ఫనిముట్టు కుంటే తునిగిపోయే వెదురుబూరతో చేసెయ్యటం బాగా నేర్చాడు. ఈ మహామేధావికి ముందు జరగబోయే విషయాలు కన్నుల ముందు కదిలాడేవి. అద్భుతమైన దూరదృష్టి ఈతని సొత్తు. తాను అనుకున్నది సాధించటంలో ఏదైనా అవరోధాలు ఎదురైతే వాటిని తొలగించుకునేందుకు ఎటువంటి సాధన సంపత్తినయినా వాడుకునేవాడు. నిర్ణయాలలో జాప్యం ఉండదు. ఎక్కడిదక్కడ తేలిపోవలసిందే. అవును మరి! ఒక సామాన్య రాజకుటుంబంలో జన్మించి భరతఖండాన్నంతా ఒక కీలుబొమ్మగా ఆడించాలంటే మరి ఎటువంటి ప్రతిభకావాలి!!

శ్రీకృష్ణుడు యావద్భారతంలో అటు పలుకుబడో, యిటు రాచరికమో సంపాదించేందుకు ప్రయత్నించేవాడు. ముందుగా తమ కుదురులో పెత్తనం చలాయించేందుకు త్వరత్వరగా చుట్టరికాల్ని పెంచుకున్నాడు.

భోజ క్షమానాథు పుత్రి రుక్మిణి చెట్ట
 వట్టెను రాక్షసోద్వాహమందు
బూటకంబులు చెప్పి పారపుచ్చి సత్యభా
 మను వివాహంబాడె మరులు చూపి
విందాను విందుల ప్రియ సహోదరి మిత్ర
 విందును మెలపుతోఁ బెండ్లియయ్యె
నగ్న జిన్నృపుని నందన నాగ్న జిత్తిని
 బరిణయంబాడెను బందెమొడ్డి

నరకు బొరిపుచ్చి దురమాడునరులు బొగడఁ
బెండ్లి పెండ్లంచుఁబదియారువేల రాచ
కన్నెలకుఁదాళి బొట్టును గట్టివైచె
మధ్య దేశంబు బాంధవ మయముగాఁగా!

అతి భయంకరాటవులందు యమున యొద్ద / స్వైర వృత్తిని నిరతంబు సంచరించి
నాటవిక కన్య కాళింది యనెడు నామెఁ / బరిణయం బయ్యె దనవార లెఱుగకుండ.

మద్రవసుమతీనాథు కొమార్తయైన / భద్ర గుణసముద్రను భూవి వైభవమున
మత్స్యయంత్రంబుఁ బడగొట్టి మహితశక్తి / బెండ్లి పెద్దలు వెఱగందఁ బెండ్లియాడె.

కొండగవుల యందుఁ గ్రమ్మరు భల్లూక / జాతి జాంబవంతుఁ జావగొట్టి
వానిబిడ్డ జాంబవతిని బెండిలియాడె / నడవి జాతి పొందునాసఁజేసి.

ఇలా అంతర్గత వైషమ్యాలకు అడ్డుకట్టవేసి శ్రీకృష్ణుడు మింటికి మంటికి తాళం వెయ్యాలని తలపోసే సమయంలో జరాసంధుడు అడ్డుపడ్డాడు. పదునెనిమిది పర్యాయాలు కృష్ణుణ్ణి యుద్ధభూమినుండి పారద్రోలాడు. జరాసంధుని అల్లుడు కంసుడు తన మేనల్లుడైన కృష్ణుణ్ణి ఏదో విధంగా వధించాలని కూర్చున్నాడు. ఇది కనిపెట్టిన కృష్ణుడు కంసునింటి దాసియైన త్రివక్ర యింటికి వెళ్ళాడు. ఆకుబ్జతో కామక్రీడలలో మునిగి ఏమేమి రసహస్యాలు గ్రహించాడో ఆ భగవంతునికే ఎరుక!

''ఖల సంయోగ మటంచు దానెఱిగియున్ గార్యార్థి శ్రీకృష్ణుఁడా
కుల పాటుంగనకుండ దాసియను సంకోచంబు లేకుండఁ బు
వ్వుల సెజ్జన్ గఱగించెఁగుబ్జను గడున్ ఫూత్కార సీత్కారముల్
గళరావంబులు ధూత్కృతంబులు సెలంగన్ గామశాస్త్రజ్ఞుడై.''

(సశేషం)

# ఆధునికత - ఆధునికానంతరత

- శివలింగం

వాదం అంటే కొన్ని స్పష్టమైన భావాల సమాహారం అని అర్థం. ప్రస్తుతం ప్రతిదాన్నీ వాదాలతో పిలవడం ఆనవాయితీగా కనబడుతూవుంది. పోస్టు మోడర్నిజం అంటే ఆధునికానంతరవాదం అనాలి. నిజానికి అది ఒక వాదం కాదు. అదొక ఉద్యమం, ఒక దృక్పథం, ఒక స్థితి. క్రమబద్ధమైన సిద్ధాంతానికి ఎదురీదుతుందీ ఆధునికానంతరం. సామాజిక కార్యకలాపాలనుండి నిరోధించేది ఆధునికానంతరమని వామపక్షం అంటుంది. తత్వశాస్త్రం, వాస్తు, సంగీతం, సాహిత్యం, రాజకీయాలు మొదలైనవాటన్నిటిలో ఆధునికానంతరం స్థానమాక్రమించింది.

ఆధునికతకు ఆధునికానంతరానికి సంబంధం వుంది. ఆధునికానంతరం ఆధునికతకు వ్యతిరేకి కాదు, అదొక పునర్నిర్మాణం, పునర్వ్యాఖ్యానం, ఆధునికతకు నూతనార్థాన్ని యిచ్చే ప్రయత్నం. **'Rewriting modernity is what is post modamity'** అని లయటార్డ్ అన్నాడు. ఇజం అంటే వాదం కనుక ఆధునికానంతరం వాదం కాదు. ఆధునికత అంటే నవీనగుణం. మార్క్సిజం అనంతరం నవ్యవామపక్షం (1970 తో పాశ్చాత్య దేశాల్లో అంతరించింది). నిర్మాణానంతరం అంటే వినిర్మాణం, పోస్టు పాజిటివిజం, మతాన్ని, అధిభౌతికతను మూడు స్వతంత్ర విధాలుగా విభజించడం జరిగింది. సైన్సు, నీతి, కళ. పీటర్ బెర్గర్ అయిదు లక్షణాలు ఆధునికతగా పేర్కొన్నారు.

1. నైరూప్యత 2. భవిష్యత్తు 3. వైయక్తికత.4. విముక్తి 5. ఐహికత. మానవ సమాజాన్ని మత చైతన్యం నుండి వేరుచేయడమే ఆధునికత ముఖ్యలక్ష్యం. మానవునికి పట్టం గట్టడం. మానవ అనుభవాన్నంతటినీ, అవగాహననూ ఏకం చేసే నూతన సూత్రం ఆధునికత. మానవునికి, సమాజానికి పూర్తి స్వాతంత్ర్యం కల్పించడమే ఆధునికతసాహసోపేత నిస్సందేహ నిశ్చితాభిప్రాయం. మత, సాంప్రదాయాధికారాల్ని ఇది అంగీకరించదు. మానవీయతను, హేతువును అంగీకరిస్తుంది ఆధునికత.

ఆధునికత పాశ్చాత్యదేశాల్లో 1789 ఫ్రెంచి విప్లవంతో ఆవిర్భవించింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, బౌద్ధిక, తాత్వికరంగాల్లో ఆధునికత రేకురేకుగా విప్పుకోవడం ఆరంభమయింది. పద్దెనిమిదో శతాబ్దం మధ్యన ప్రారంభమైన ఆధునికత పందొమ్మిదవ శతాబ్దార్థానికి పూర్తి అయింది. భౌగోళికంగా అన్ని సంస్కృతులలోకి వ్యాపిస్తోంది. నాగరిక, సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధిని స్వీకరించిన సమాజాల్లోకి ఆధునికత ప్రవేశిస్తోంది. భారతదేశంలోనూ ప్రవేశించింది. ఇంకా ప్రజలు నిరక్షరాస్యులుగా వుండటం వలన అది పూర్తిగా జయించలేదు. విజ్ఞాన వికాసం అంటే ఏమిటన్న ప్రశ్నకు ఇమ్మాన్యుయల్ కాంట్ చక్కని సమాధానం చెప్పాడు.

తనకు తాను ఆపాదించుకున్న అపరిపక్వత నుండి మానవుడు బయటపడటమే విజ్ఞాన వికాసం **(Enlightenment)**. ఇతరుల ప్రభావంలేకుండా తనను తాను అర్థం చేసుకునే శక్తి లేకపోవడమే అపరిపక్వత. అపరిపక్వత తనకు తాను ఆపాదించుకున్నదే. హేతువు నశించడానికి కారణం అవగాహనలోపం కాదు. ధైర్యం, తీర్మానం లేకపోవడమే. బాహిరమైన అధికారం లేకుండా స్వయంగా ఏపనీ చేయడానికి యిష్టపడకపోవడం. స్వీయ అవగాహనతో ప్రవర్తించు. ధైర్యాన్ని స్వీకరించు. ఇదే విజ్ఞానవికాసం.

ఆధునికానంతరం అంటే ఏమిటి అన్న ప్రశ్నకు కాంట్ చెప్పినమాటల్నే లయహర్డ్ స్వీకరించాడు.

బుద్దుని జ్ఞానోదయానికి యూరపు విజ్ఞాన వికాసానికి భేదం వుంది. రెండూ ఒకటి కాదు. ఆధునిక విజ్ఞానశాస్త్రానికి, సాంకేతికతకు, నగరపారిశ్రామిక సమాజానికి, విజ్ఞాన వికాస ఉదారవాదానికి సంబంధ బాంధవ్యాలున్నాయి. ఇవి ఆధునికత నుండి ఉద్భవించినవే. మార్క్సిజం ప్రవచించిన ఆదర్శ సమాజ నిర్మాణ ప్రయత్న ఫలితాలే. యూరపులో విజ్ఞాన వికాసోద్యమం మీద విమర్శ ఫ్రాంకు ఫర్టు స్కూల్‌తో ఆరంభమైంది అది హిట్లర్ పాలనాకాలం.

**`Enlighenment is Totalitarian'** అన్నాడు అడోర్నో. విజ్ఞాన వికాస ఉదారవాదం నుండి నాజీనియంతృత్వావిర్భావించింది. ప్రకృతిలోని అన్నిటి మీదా మానవ అధిపత్యాన్ని నొక్కిచెప్పింది. జ్ఞాన మీమాంసమీద పరుషంగా దాడిచేశాడు అడోర్నో. జ్ఞాన మీమాంసలో ప్రధాన లోపాన్ని ఆయన లేవనెత్తాడు. జ్ఞాన మీమాంస ద్వారా జ్ఞాన మీమాంస తనకు తానుగా స్థాపించుకోలేదన్నాడు. కాంట్‌ను గురించి హెగెల్ కేట్‌గరీస్ విషయంలో ఇదే ప్రశ్నవేశాడు. నాగార్జునుడుకూడా 'మీ శాస్త్రం స్పష్టమయిన ప్రమాణాలమీద ఆధారపడినప్పుడు, ప్రమాణాలను స్థాపించిన ప్రమాణాలు ఏవిటో అడగవచ్చా' అన్నాడు. ఆధునికానంతరం ఒక తాత్విక సిద్ధాంతాన్ని స్థాపించడంలో వున్న చిక్కుల్ని గుర్తించింది. ప్రాపంచిక సత్యాన్ని సైన్సు రుజువుచేస్తుంది. తరవాత దాన్ని ప్రశ్నించడమూ జరుగుతుంది. విషయి కాని విషయం అనేది లేదు. ప్రత్యక్షానుభవం ఆత్మీయమేకాని పరకీయం కాదు. సైన్సు విషయి కాని విషయమూ కాదు, రుజువైనది చివరిదీ కాదు.

ఆధునికానంతరం అంటే విజ్ఞాన వికాసానంతరం, ఫ్రాంకు పర్టుస్కూల్ తరవాత నవ్యవామపక్షం ఆదర్శసమాజ స్థాపనకోసం ఏదో ఒక కొత్తదనం కోసం ప్రయత్నించింది. హెర్బర్టు మార్క్యూస్ నవ్య వామపక్షీయ మేధావుల్లో గణనీయుడు. 1968లో యూరపు, అమెరికాలలో విద్యార్థులు తిరుగుబాటు చేశారు. కాలిఫోర్నియా, ఫ్రాన్సులలో కూడా మార్క్యూస్ ప్రభావంతో విప్లవాలు సృష్టించారు. మానవాళి విప్లవానికి సిద్ధంగావున్న తరుణమని, విద్యార్థులంతా సమరశంఖం పూరించాలని ప్రోత్సహించాడు. రెచ్చగొట్టాడు. పాతదంతా నశించి దాని చితాభస్మం నుండి నూతన సమాజావిర్భావం జరుగుతుందన్నాడు. విద్యార్థులు తిరుగుబాటు చేసి విశ్వవిద్యాలయాన్ని వశపరచుకొన్నారు. నడిపారు. సార్బోన్, నాంటెర్ విశ్వవిద్యాయాలను ఆక్రమించారు. ఫ్రెంచి విప్లవంకన్నా అర్థవంతమైనదని అభివర్ణంచుకున్నారు. మానవ సంక్షేమమే ధ్యేయంగా నూతన సమాజ స్థాపన లక్ష్యంగా పెట్టుకుని తిరుగుబాటు చేసిన విద్యార్థుల స్వప్నం రెండు సంవత్సరాల్లో చెదిరిపోయింది. యూరపు, అమెరికా దేశాల్లోని విద్యార్థులకు కలిగిన చేదు అనుభవం దృష్ట్యా మళ్ళీ చాలాకాలం విప్లవం జోలికి పోలేదంటే ఆశ్చర్యంకాదు. ఆక్రమించిన విద్యాలయాలను విడిచిపెట్టారు. శబ్దానికి **(Word)** శక్తిలేదని గుర్తించారు.

ఈ తరుణంలోనే డెరిడావి నిర్మాణం ఆరంభమైంది. విద్యార్థుల తిరుగుబాటు విఫలమయిన విషాదానుభవ సమయం. ఉదారవాదం చేదయింది. మార్క్సిజానికి వృద్ధాప్యం వచ్చి మంచంపట్టింది. వీటి నుంచి ఏదో మంచి జరుగుతుందన్న ఆశలేదు.

సాంస్కృతిక రాజకీయ విముక్తి కావాలి. ఇజం మీదా ఆశలు అడుగంటాయి. రాజకీయాలు

సాహిత్యం కళ కలిసిపోవాలి. ఒక కొత్త దారిలో పయనించాలి. సిద్ధాంతానికి బానిసకాకూడదు. అన్ని సిద్ధాంతాలు విఫలమయినాయి. నూతనత్వం కోసం ప్రయత్నం జరిగింది. రాజకీయ సిద్ధాంతాల చేత మానవుడు మోసగించబడుతున్నాడు. అరాచక సిద్ధాంతాల వల్ల అమాయక ప్రజలు, యువకులు బలైపోతున్నారు. ఆధునికానంతరంలో వైయక్తికతత్వం ప్రబలింది. ఏ ఇజానికీ లొంగని తత్వం నేటియువతరంలో కనిపిస్తున్నది. వ్యక్తి వికాసంలోనే విశ్వ వికాసాన్ని ప్రతిబింబింపచేస్తున్నాడు. మతాలకన్నా రాజకీయాలే నల్లమందు మత్తు లాంటివని భావిస్తున్నాడు. అన్నిటి కన్నా మానవుడే మహిమాన్వితుడని నమ్ముతున్నాడు.

**తెలుగు సాహిత్యంలో ఆధునికత - ఆధునికానంతరత**

1890-1920 కాలం తెలుగు సాహిత్యంలో నవ్యత ప్రవేశించింది. గురజాడ ఆధునికతకు ఆద్యుడనడంలో సందేహం లేదు, రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, బాపిరాజు, చలం వంటి వారి రచనల్లో కాల్పనికత దర్శనమిచ్చింది. కాల్పనికతలో పూర్వ చరిత్ర, సంస్కృతుల పునర్దర్శనం వుంటుంది. ఆదర్శనం ఆధునికం. గురజాడ, ఉన్నవ, కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్ వంటి వారిరచనల్లో వాస్తవికత కనిపిస్తుంది. వాస్తవికతలో ప్రాచీన సంస్కృతి అవశేషాలుండవు. ఆధునిక జీవితం వుంటుంది. ఆధునిక నాగరికత వుంటుంది. పారిశ్రామిక నాగరికత సమాజంలో తెచ్చిన మార్పు వుంటుంది. ఈ రెండేగాకుండా మానవ మనస్సు లోతుల్లోకి అన్వేషించి తనెవరో తెలుసుకునే ప్రయత్నం కూడా కనిపిస్తుంది. ఆధ్యాత్మిక అనుభవాన్ని తెలియచేస్తున్నాడు.

తర్కవితర్కాలకు అతీతమయిన అనుభూతి కవిత్వం చెపుతున్నాడు. భౌతిక, ఆధ్యాత్మికాలకు మధ్య నలిగిన అస్తిత్వ కవిత్వం చెపుతున్నాడు. వీటన్నిటికి అతీతమయిన అనుభవాతీత కవిత్వం చెపుతున్నాడు ఆధునికానంతర కవి.

ఆధునికానంతర కవిత్వంలో పదాల పోహళింపులకు బదులు పదాల నిష్ఫలత కనిపిస్తుంది.

మానవుణ్ణి మానవునిగా గుర్తించడం ఆధునికత అయితే మానవునిలోని ఆంతరికమానవుణ్ణి అన్వేషించడం ఆధునికానంతరం.

ఒక రాజకీయ వాదానికి నిబద్ధత ఆధునికమయితే సకలవాదాలకు అనిబద్ధుడు కావడం ఆధునికానంతరం.

అంతర్ బహిర్ చేతనలను సమన్వయపరచడం ఆధునికానంతరం. వ్యక్తి వికాసం ద్వారా సమాజ వికాసాన్ని కోరుకుంటుంది. ఎవరి మతాన్ని కాదనకుండా మతంలోని మూఢవిశ్వాసాలను వదలి సర్వధర్మసారాన్ని గ్రహించమంటుంది. అంతస్సారం ఒకటే వ్యక్తి తను మారి పరిసరాలకు ఈ మార్పును వర్తింపచేయాలి. కాని పైనించి బలవంతంగా హింసాపద్ధతుల ద్వారా సంస్కరణనిరుద్దటం అసాధ్యం. అధికార కేంద్రీకరణ అనర్థదాయకం. ఆచరణలో విఫలంకాక తప్పలేదు. అందని దాన్ని ఆశించడంలేదు. బతకడానికి కావలసినదాన్ని అడుగుతున్నాడు. ఆధునిక నాగరకత వృక్షఫలాలు అందరికీ అందేలా చూడాలంటున్నాడు. సర్వ మానవుల హృదయాల్లో కరుణ, దయ, సోదరప్రేమలు స్థానమాక్రమించినప్పుడే శాంతి సమైక్యతలు స్థాపించబడతాయి. ఆధునికానంతర కవుల్లో వేగుంట, సీతారాం, ఇస్మాయిల్, చినవీరభద్రుడు, కొత్తపల్లి, అజంతా, త్రిపుర, నాసరరెడ్డి వంటివారు ఆధునికానంతర కవిత్వాన్ని రాశారు. ఇంకా ఎందరో రాస్తున్నారు. కథానికా సాహిత్యంలోకంటే ముందు అంతర్జాతీయ భావాలు కవిత్వంలోనే కనిపిస్తాయి. ఆధునికతకు ప్రతిక్రియ ఆధునికానంతరం.

**కొత్తవెలుతురు**

# హిందూ మతం
# అర్థాలు - అపార్థాలు

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

హిందూమతాన్ని గురించి రాసిన తొలి పాశ్చాత్యులు దానిని పక్షపాత దృష్టితోనే చూశారు. ఈ రకమైన రచనలకు 1630లో హెన్రీలార్డ్ రాసిన గ్రంథం "A discovery of the sects of the Babians" శ్రీకారం చుట్టింది. హెన్రీలార్డ్ క్రైస్తవ మతాచార్యుడు. ఆయన హైందవాన్ని క్రైస్తవ దృష్టినుంచే చూశారు. రెండో గ్రంథం డచ్ క్రైస్తవుడు అబ్రహామ్ ఫోజెర్ 1651 లో రాసింది. మూడో గంథ్రం 1672లో మరో డచ్ క్రైస్తవ మతస్తుడు ఫిలిప్‌బాల్డన్( ఇంగ్లీషు అనువాదం 1704) రాసిన "An account of the Idolatry of the pagans in the East Indies" వీరెవరూ గూడ హిందూ మతాన్ని నిష్పక్షపాత దృష్టితో చూడలేదు.

ఎప్పుడైనా పాశ్చాత్య దేశాలకు చెందిన రచయిత ఎవరైనా హిందూ మతాన్ని గురించి ఒక మంచి మాట చెప్పాడా? భారతీయ నాగరకత అంటే అత్యంత గౌరవం ఉన్న వోల్టేరు గూడ హిందూమతాన్ని గురించి ఒక మంచి మాటైనా చెప్పలేదు. ''మనకు వచ్చిందంతా గంగానది నుంచే వచ్చింది,'' అని ఆయన అన్నాడు. అటు వంటి వోల్టేరు హిందూ మతాన్ని గురించి ఏమీ చెప్పలేదు.

తొలి క్రైస్తవ మిషనరీలకు ''హిందువులు ప్రతిమలను పూజిస్తున్నారని'' మాత్రమే తెలుసు 1785లో భగవద్గీతను చార్లెస్ విల్కిన్స్ ఆంగ్లంలోకి అనువదించే వరకూ, హిందూమత గ్రంథాలను గురించి పాశ్చాత్యులకు ఏమీ తెలియదు. ఈ భగవద్గీతను మెచ్చుకొన్న వారిలో వారెన్ హేస్టింగ్స్ (1732-1818) ఉన్నాడు. విల్కిన్స్ అనువాదానికి ఇతడు రాసిన ముందు మాటలో, "I hesitate not to pronounce the Geeta, a performance of great originality, of a sublimity of conception, reasoning and diction, almost unequalled and a single exception, among all the religions of mankind, of a theology accurately corresponding with that of the Christian dispensation and most powerfully illustrating its fundamental doctrines." ఆ ముందు మాటలో ఇలా అన్నాడు "The Bhagavadgeeta will survive, "When the British dominion in India shall have long ceased to exist, and when the source which it once yielded of wealth and power are lost to rememberance". మొదటిగా ఒకపాశ్చాత్యుడు హిందుమతాన్ని మెచ్చుకోవడం ఇదే.

తరవాత హిందూమతం మీద పాశ్చాత్యుల అభిప్రాయాలలో మార్పు తీసుకొచ్చింది, దక్షిణ భారత దేశంలో 31 సంవత్సరాలపాటు నివసించిన ఫ్రెంచి మిషనరీ జాంఅబా దూబె (Jean Abbe Dubois 1765-1848) రాసిన ''హిందు ఆచారాలు, మర్యాదమన్ననలు, వేడుకలు'' (Hindu Manners, Customes and Ceremonies). ఈ గ్రంథాన్ని ఫ్రెంచినుంచి 1816లో అనూదించి లండన్‌లో ప్రచురించారు. ఈ గ్రంథాన్నే 1897లో హెన్నీకె. బూ చాంప్స్ (Henry K. Beanchamps) తిరిగి అనువదించాడు. మాక్స్‌ములర్ దీనికి ఆముఖం రాశాడు. దూబెకు హిందువులంటే ఉన్న అభిప్రాయాన్ని అతని ఈ మాటలలో వివరించవచ్చు; ''సవర్ణ

హిందువు తరచుగా దొంగ వాడో, చెడ్డవాడో అయి ఉంటాడు. వర్ణం లేని హిందువు (అవర్ణ హిందువు) వట్టి నీతినిజాయితీలు లేని మూర్ఖుడు.''

దూబెను గురించి అలెక్స్ అరన్‌సన్ ఇలా వ్యాఖ్యానించాడు. ''ఫ్రెంచి విప్లవభయానక స్థితి నుంచి భారతదేశానికి పారిపోయిన దూబెకు క్రైస్తవులు కాని వారిని క్రైస్తవంలోకి మార్చి, వారిని నాగరికులుగా దిద్దవలసిన బాధ్యత ఉంది. అందుకని దక్షిణ భారతంలో 31 సంవత్సరాలు నివసించిన తరవాత అతడు హిందువులకు బద్ధ శత్రువు అయ్యాడంటే ఆశ్చర్యం లేదు.''

అసలు హిందువులను పాశ్చాత్యులు ఎప్పటినుంచి సరిగా చూడడం మొదలు పెట్టారు? 19వ శతాబ్ది ఉత్తరార్ధం నుంచి, జర్మన్ భావవాదులు, వారిని అనుసరించి అమెరికన్ ఆధిభౌతికవాదులు, గ్రీకు రోమ్ యూదు - క్రైస్తవ సంస్కృతిని దాటి దానికి ఆవల ఉన్నత ఆధ్యాత్మికనైతిక విలువల కోసం వెదకవచ్చునని పాశ్చాత్యులకు హితవు గరిపినప్పటి నుంచి, హిందూ మతం యెడ వారిదృక్పథంలో మార్పువచ్చింది.

హిందుమతాన్ని, తత్త్వాన్ని, తన మత విశ్వాసం కంటె గూడ గొప్పగా పొగిడినవాడు ఆర్థర్‌షోపన్‌హర్ (Anther Schopenhauer 1788-1860) లాటిన్ అనువాదం నుంచి ఇతడు మన ఉపనిషత్తులను అధ్యయనం చేశాడు. లాటిన్ అనువాదానికి మూలం ఫ్రెంచ్‌లో అబ్రహామ్ హియసిన్తెదు పెరన్ (1731-1795) రెండు సంపుటాలలో మొత్తం 1651 పుటలలో వాటిని ప్రచురించాడు. వీటికి మూలం పర్షియన్ భాషలో ప్రచురితమైన ఏభై ఉపనిషత్తులు. షాజహాన్ కొడుకు దారాసుకో కాశీనుంచి పండితులను రావించి (1656-57) పర్షియన్ మూలాన్ని తయారు చేయించాడు.

లాటిన్‌లో ఉపనిషత్తులు చదువుకొన్న షోపన్‌హర్, తన గ్రంథరాజం "The world as will and Idea" (1818)లో '' ఈ మానవజాతి ప్రాచీన జ్ఞానానికి గలలీ (Galilee - ప్రాచీన ఇజ్రేల్‌లో ఒక రాష్ట్రం) లో సంభవించింది ఏదీ ప్రత్యామ్నాయం కాలేదు. అంతేకాదు, భారతీయతత్త్వం ఐరోపాకు ప్రవహించి, మన జ్ఞానంలోను, ఆలోచనా విధానంలో మౌలికమైన మార్పులు తీసుకొస్తుంది'' అని రాశాడు. ''తత్ త్వమ్ అసి'' అనే ఉపనిషత్సిద్ధాంతం గురించి ఈ జర్మన్ తత్వవేత్త, తన ఒకవ్యాసంలో, '' ఈ మహావాక్యాన్ని ఎప్పుడూ ఉచ్చరించవచ్చు, జంతువుల సందర్భంలోగూడ, ఇతరంతో పాటు మన తాదాత్మ్యతను, మనమనస్సులో నిలుపుకోవడానికి,'' అని చెప్పాడు. తనపై ఉపనిషత్తులు వేసిన ప్రభావం గురించి, తన **'Comments and Omissions'** అనే గ్రంథంలో, ''అవి నా జీవిత సాంత్వనం, అని నామరణ సాంత్వనం'' అన్నాడు.

లాటిన్‌లో గీతను చదివిన తరవాత **A.W. Schlegel (1767-1845) Wilhelm Von Humbolt (1767-1835)** లు ఆ ''కృతి''ని గురించి, ''అత్యంత సుందరమైంది, అంతేకాదు, మనకు తెలిసిన కావ్యాలలోకెల్ల నిజమైన తాత్త్విక మహాకావ్యం అదొక్కటే,'' అన్నారు. హంబోల్ట్ తన స్నేహితునికి రాసిన లేఖలో, 'నేను దేవునికి ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. ఎందుకంటే, నాకు భగవద్గీత చదవడానికి కావలసినంత కాలం నన్ను జీవంతో ఉంచినందుకు.'' అని రాశాడు.

ఈ జర్మన్‌ల ప్రతిస్పందన అమెరికాలో అధిభౌతిక ఉద్యమ నేతలిద్దరిని అత్యంతంగా ప్రభావితం చేసింది. వారు రాల్ఫ్‌వాల్డో ఎమర్సన్ (1803-1882) డేవిడ్ థొరో

(1817-1862)లు. వీరిని ''బోస్టన్ బ్రాహ్మలు'' అంటారు. గీతను గురించి ఎమర్సన్ అంటాడు: ''అది అన్నింటిలోకి ప్రథమం. మనతో ఒక మహాసార్వభౌముడు మాట్లాడినట్లుంటుంది. అందులో అల్పమైందిగాని, హీనమైందిగాని ఏమీ లేదు.'' తొరో ఏమన్నాడో చూడండి: ''ఉదయాన్నే లేచి, భాగవద్గీత అద్భుత ఆశ్చర్యకర విశ్వతత్వంతో నా బుద్ధిని కడుగుతాను.'' అయితే వీరి ప్రభావం ఏమి గూడ గతశతాబ్ది చివరి వరకు ఆంగ్లేయుల మనస్సు మీద పడలేదు. ఎందుకంటే, క్రైస్తవం వారిని రెండోమతం వైపు చూడనీయలేదు. ప్రపంచ మతాల సమాఖ్యకు అన్నిమతాలకు ఆహ్వానం పంపినప్పుడు, కాంటర్‌బరీ ఆర్చిబిషప్, ''ప్రపంచంలో ఉన్నది ఒకే ఒక మతం క్రైస్తవం అయినప్పుడు, ప్రపంచమతాలేమిటి? వాటిల్లోకి మాకు సభ్యత్వమేమిటి?'' అని ఈసడించుకొన్నాడు. అలాంటి '' ఆంగ్లమనస్సు'' మన ఈ శతాబ్దిలో బీటలు వారింది. దీనికి ముఖ్యకారణం రామకృష్ణ - వివేకానందుల సార్వత్రిక మతాదర్శం. ''హిందూమతం గూడ మానవుని ఆధ్యాత్మిక నైతిక చరిత్రలో ఒక గణనీయమైన శక్తే'' అనే గుర్తింపు మొదలైంది. వివేకానందుని ప్రభావక ప్రచారంతోనే హిందూమతం ఒక ప్రపంచ మతమైందన్నాడు డా. గెరిన్. హిందూమతం అంటే ఏమిటి? అనే ప్రశ్న అడుగుతూనే ఉన్నారు. కాని దీనికి సంతృప్తికరమైన సమాధానం రావడం లేదు. సర్ ఆల్‌ఫ్రెడ్ లియాల్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించిన వ్యక్తి. '' ఆః హిందూ మతం అంటే ఏముంది? మూఢనమ్మకాలు, దయ్యాలు, పిశాచాలు, అర్ధదేవతలు, దేవతలైన ఋషులతో కలగాపులగమైన ఒక కీకారణ్యం'' అన్నాడు.

ఏది ఏమైనా, పందొమ్మిదో శతాబ్దంతానికిగాని హిందూమతం అంటే ఒక గౌరవభావం పాశ్చాత్యులకు కలగలేదు. 1879లో, 1883లో మాక్స్ ములర్ సంపాదకించిన **"Principal Upanishads", "India: What it can Teach us" (1882)", Philosophy of Vedanta" (1894)** లతో హిందూమతం అంటే పాశ్చాత్యులకున్న దృక్పథం మారిపోయింది. **Deussens** రాసిన **"Philosophy of the Upanishads"** వివేకానందుని వేదాంతం మీద ప్రాశ్చాత్యులకు నూతన వెలుగును ప్రసరించింది. వాస్తవానికి పాశ్చాత్యులు రాధాకృష్ణన్, అరవింద్, వివేకానందుల రచనల నుంచి హిందూమతం అంటే ఏమిటో తెలుసుకొన్నారు.

హిందూమతాన్ని గురించిన రచనలన్నింటిలోకి ముఖ్యమైంది మాక్స్ వెబర్ (1864-1920) అనే జర్మన్ సమాజశాస్త్రవేత్త ఈ శతాబ్ది తొలిభాగంలో రాసిన **"The Religion of India"**. ఇది ఆంగ్లంలోకి 1958లో అనూదితమైంది. '' ఇక్కడ ( భారతదేశంలో) ఇతరసిద్ధాంతాలకు, మతాలకు సహనం ఎంతో ఉంది.'' అన్నాడు ఈ సందర్భంలో బౌద్ధాన్ని గూడ కలిపి అధ్యయనం చేసి. ''హిందూమతంలో ఎక్కడా? చాదస్తం లేదు, హిందూమతం మన అర్థం చేసుకొన్న తీరులో అది మతమేకాదు,'' అన్నాడు. ''హిందూమతం ఒక సజీవమైన ఎదిగే మతం అంతేకాని ఎవో కొన్ని గ్రంథాలకు అంటిపెట్టుకు కరుడు కట్టుకుపోయిన నిర్జీవ నిర్మితికాదు. తాను మారుతూ గూడ, నూతన మూలకాలను తనలో కలుపుకొనే ప్రక్రియ. అదిస్థాణువు కాదు,'' అన్నాడు **A.C. Boquet**. ఒక మతాన్ని మనం ఎలా అర్థం చేసుకొంటాం? ఆ మత పవిత్ర గ్రంథాలను చదివా? కాదు, ప్రజలు ఆవిశ్వాసాన్ని తమ సామాజిక, వైయక్తిక జీవన ప్రక్రియలలో ఎలా ప్రతిబింబిస్తున్నారనే దాని ఆధారంగా అర్థం చేసుకొంటాం. వారిని వారి ఆలోచనలను ఆవిశ్వాసం ఎలా ప్రభావితం చేస్తుంది? ఎలా అదుపు చేస్తుంది? దానిని వారు ఎలా ఆచరిస్తున్నారు అనేది ముఖ్యం. ఏమతాన్ని

అయినా అర్థం చేసుకోవడానికి ఒక్కొమాటు మనిషి తన అత్యంత సృజనాత్మక స్థితిలో సృజించిన దానిని, తన ఋషిపుంగవులు ప్రకటించిన జీవితాదర్శాన్ని, అందరూ సమంగా అర్థం చేసుకోలేకపోవచ్చు. అంత మాత్రం చేత ఆసృష్టి యొక్క, ఆ ఆదర్శం యొక్క వాస్తవికత హీనమైపోదు. అది అలాగే ఉంటుంది. ప్రతి మత చరిత్రలోను పునర్వికాసం వచ్చిందంటే, అది ఒక నవీకరణం, పాత ఆశంసను యథార్థీకరణం చేయడం. అందుకని మత చరిత్ర ప్రాచీన గ్రంథాలకే పరిమితమైపోదు. అందుకే ''దేవుని పుస్తకం ఎప్పటికీ పూర్తికాదు'' అన్నాడు వివేకానందుడు.

హిందూమతపరంగా ఈ విషయాన్ని మొదటిగా సమగ్రంగా అర్థం చేసుకొన్నవాడు డా. జె. ఎస్టిలిన్ కార్పెంటర్. 'మధ్యయుగ భారత దేశంలో ఆస్తిక్య విద్య **(Theism)**' అనే 552 పుటల గ్రంథం **(Theism in Medieval India)** అతడు రాశాడు. ప్రాచీన సంస్కృత గ్రంథాలకు అతడు ఎంత ప్రాముఖ్యం ఇచ్చాడో, ప్రాంతీయ భాషలలో వెలసిన, ఆళ్వారులు, కబీర్, నానక్, నామదేవ్ ఇంక తమిళ శైవుల లాంటి మార్మికులకూ అంత ప్రాముఖ్యం ఇచ్చాడు. మధ్యయుగ భారతదేశంలో వెలసిన ఈ మార్మికుల తత్వాన్ని మొదటిగా సరిగా అర్థం చేసుకొన్నవాడు ( ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో బాడెన్ సంస్కృత పీఠాన్ని అధిష్టించిన) హరేస్ హేమన్ విల్సన్ (1786-1860). ''హిందువుల మత జీవితా''న్ని రేఖా మాత్రంగా **Aseatic Researches Vol xvi (1828) and Vol xvii (1832)** లలో ప్రచురించాడు. ఇతని సారాంశం ఏమంటే హిందూ సన్యాసులు ప్రబోధించింది ''అంధ విశ్వాసాల కీకారణ్యం కాదు, పైపైన కొన్ని తేడాలు ఉన్నా, వాటి మధ్య ఏకీభావం గూడ ఉంది,'' అన్నాడు. **Great Religions of Modem Man (1961)** అనే గ్రంథంలో **Louis Renow** ''సంస్కృతేతర మూలాలు'' అనే ఒక విభాగం ఉంది. ఇందులో మధ్యయుగ మార్మికులనే కాక, రామమోహనరాయ్, రామకృష్ణ, వివేకానంద, ఠాగోర్, గాంధి, శ్రీ అరవిందుల నుంచి ఉటంకించాడు. ఈ విధంగా మధ్యయుగ, ఆధునిక మత సంప్రదాయాలను మధ్య అఖండతను సాధించాడు.

తరవాత చెప్పదగినవాడు డా. గరిన్ **(Dr. Garrin)**. ఇతడు హిందూ మతాన్ని సమూలంగా, సమగ్రంగా, సమవాయంగా దర్శించాడు. హిందుమతం మీద అతనికున్న అసమాన పాండిత్యంతో హిందూమతంలో పైకి కనిపించే వైవిధ్యం వెనుక ఉన్న '' ఆంతరంగిక సంగతత'' **(Internal Coherency)** ను వెలికి తెచ్చాడు. ఇంతవరకు ఏ పాశ్చాత్యుడు చేయలేని పనిని ఇతడు చేశాడు. ''అనుచానంగా వస్తున్న తత్వాన్ని హిందూ తత్వం, అనుచాన ఆధునికతతో జోడించి, రెండింటి మధ్య ఏకతను ప్రదర్శించింది. ఆధునికత గతం నుంచి నిష్పన్నమై వికసించిందే.'' ఆధునికత ప్రాచీనతత్వాన్ని కాదనదు. ఇతడు గాంధీని ''పునర్వికాస హిందూత్వం''లో అంతర్భాగంగా వర్ణిస్తాడు. ఈ హిందూ పునర్వికాసం ఆధునిక ప్రపంచలో బాగా అభివ్యక్తమైంది. **Zaehner's** రాసిన **Hinduism (1962)** లోని చివరి ప్రకరణం ''యుధిష్ఠిరుని పునరాగమనం''. ఈ ప్రకరణంలో గాంధీని ఒక ''మహా హిందువు''గ విశ్వజనీనకుని **(Uiniversalist)** గా అభివర్ణించాడు.

1925లో స్థాపితమైన **RSS** ను, 1951లో సంస్థాపితమైన జనసంఘ్‌ను, 1964లో వచ్చిన విశ్వహిందూపరిషత్, 1966లో వచ్చిన శివసేన, 1980లో అవతరించిన భారతీయ జనతా పార్టీల గురించి, 1992 డిసెంబరు 6న పడగొట్టిన బాబ్రీమసీద్ గురించి డా. గారిన్ ఫ్లడ్ క్లుప్తంగా స్పృశించాడు. అయితే ఇతడు హిందూ మెజారిటీ కమ్యూనలిజమ్ వల్ల తలెత్తిన సమస్యలను

పట్టించుకోలేదు. కాని 1993-94 పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం నిర్వహించిన గోష్ఠిలో అమెరికాకు, ఇండియాకు చెందిన పండితులు చదివిన పన్నెండు పత్రాలు ఈ సమస్యను అత్యంత సమర్థవంతంగా చర్చించాయి. డేవిడ్ లడెన్ సంపాదకత్వంలో వెలువడిన "Making India Hindu" అనే గ్రంథంలో వీటిని చేర్చాడు. ''పై చెప్పిన సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే తెలివితేటలు మన రాజకీయ నాయకులకు లేవు.'' అన్నాడాయన. ఈ పత్రాలలో ఉన్న సామాజిక విశ్లేషణ మన భారతీయ సగటు రాజకీయానికి అందదు.

1923లో వి.డి. సావర్కార్ 'హిందూత్వ' అనే 117 పుటల గ్రంథం రాశాడు. ఆ గ్రంథం ఒక విలక్షణమైన ''మనస్తత్వాన్ని'' ప్రదర్శిస్తుంది. ఆ మనస్తత్వ ఫలితమే 1992 డిసెంబరు 6 ఉపద్రవం. 75 ఏళ్ళు గడిచినా, ఈ 'మనస్తత్వం' యొక్క బుద్ధి మాలినతనాన్ని, మన నాయకులు పట్టుకోలేక పోయారు. ప్రజలకు తెలియచెప్పలేకపోయారు. మనకు తెలిసో తెలియకో ఈ మనస్తత్వాన్ని పాలు, నీరు పోసి పెంచాము.

"Making India Hindu" గ్రంథ పరిచయంలో, ప్రొఫెసర్ లడెన్, భారతదేశం స్వతంత్రం పొందాక ఎదురైన వైరుధ్యాలను సంక్లిష్టతలను ప్రస్తావిస్తూ, ''గాంధీ హిందూమత వాదిపైగా భారతజాతీయ వాది గూడ. కాని దురదృష్టం అతడొక హిందు భారత జాతీయవాది చేతిలో మరణించాడు'', అన్నాడు.

'రామరథ చిహ్నం' ఉన్న అద్వాని రథం, 1528లో బాబరు నిర్మించిన మసీదుపై ఎక్కుపెట్టిన ''కోపరథం'' అయింది. - అని ఒక పత్రం అంది.

ఇదే గ్రంథంలోని ''ప్రజోద్యమమా? శిష్టుల కుట్రా?'' అనే తన పత్రంలో శ్రీమతి అమృత బసు బి.జె.పి. గురించి చెబుతూ, అది తన రాజకీయ లబ్ధికోసం హిందుత్వం లేదా హిందూ జాతీయవాదాన్ని పురికొల్పిందన్నారు. ''సాధుసైనికులు, సైనికసాధులు'' అనే తన పత్రంలో ప్రొఫెసర్ పించ రామజన్మభూమి నేపథ్యాన్ని వర్ణిస్తూ, వి.హెచ్.పి. తీర్మానాలను భారత సాధు సమాజ్ (1956 స్థాపితం) 1989 కుంభమేలా చర్చలను ఉటంకించాడు. వాటిల్లో వ్యక్తమైన దౌర్జన్య పూరిత దృక్కోణాన్ని ప్రదర్శించాడు.

ఈ గ్రంథంలోని పన్నెండు పత్రాలు చదివిన వారు ''మన నాయకులు, పార్టీలు వాస్తవానికి వారేమి చేస్తున్నారో ఏమి చెబుతున్నారో వారికి తెలియదనుకోవలసి వస్తుంది. వారి ప్రవర్తన, విధానాల వల్ల స్థిరమైన ప్రభుత్వ వ్యవస్థ, శాంతియుతమైన పౌర సమాజాన్ని స్థాపించే మార్గాన్ని శాశ్వతంగా మూసి వేశారేమోననిపిస్తుంది. ఇంతకంటె దుస్తరమైన విషయం ఏమిటంటే, ఇలా సంఘపరివార్‌ని విమర్శించే మనం గూడ అచేతనంగా అదే ''కుటుంబాని''కి చెందిన వారలం కావడం. బహుశా ఈ కారణం వల్లనే నేమో మన కేంద్రప్రభుత్వం బాబ్రీ కూల్చివేతను నిరోధించ లేక పోయింది. హిందు మెజారిటీ రాజకీయానికి అడ్డుకట్ట వేయలేకపోయింది.

**An Introduction to Hinduism by Garrin flood (C.U.P.) Hindu, Religion, Community... And the politics of Democracy in India Ed. by David Ludden (OUP)**

# రాజనీతి సూచిక : సామ్రాజ్యలక్ష్మి పీఠిక

కన్నడమూలం :
డా. శ్రీమతి రాధాకృష్ణమూర్తి

తెలుగు సేత :
ఘట్టమరాజు

'సామ్రాజ్యలక్ష్మి పీఠిక' తంత్రశాస్త్ర గ్రంథం. సుమారు రు. 4000 శ్లోకాలు కలిగి, 139 అధ్యాయాలతో కూడిన ఈ సంస్కృత రచన 'మహాశివతంత్రం' లోని ఆకాశ భైరవ కల్పలో ఓ భాగం. ఓరాకుమారుడు తన మహదాశయాల్ని సాధించడానికై, నేర్చుకోవాల్సిన సమస్త విషయాలు ఈ గ్రంథంలో కూలంకషంగా చెప్పబడ్డాయి. రాజమహారాజులు, ఇతర రాజోద్యోగులు తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిన కరదీపికగా ఈ గ్రంథం లోకప్రసిద్ధం.

చిత్రమేమిటంటే ఈ గ్రంథాన్ని రచించిన మహనీయుని పేరు ఈ గ్రంథంలో ఎక్కడా కనపడదు. అంతేకాదు, గ్రంథ ప్రారంభంలో కాని, చివర్లోకాని ఈ పుస్తకం ఎప్పుడు రచింపబడిందో ఎక్కడ రచింపబడిందో ప్రస్తావింపబడలేదు. కాని గ్రంథంలోని అంతః సాక్ష్యాల్ని పరిశీలిస్తే, విజయనగరసామ్రాజ్య సువర్ణ యుగంలో రచింపబడి వుండొచ్చని వూహించడానికి అవకాశముంది. విజయనగర చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయ (1509 - 29) లతో సన్నిహిత సంబంధం వున్న ఓ విద్వాంసుడు ఈ గ్రంథాన్ని రాసి వుంటాడని పెద్దల అభిమతం.

సామ్రాజ్యలక్ష్మి శక్తికీర్తుల అధిదేవత, ఇతర తాంత్రిక, పౌరాణిక రచనల మాదిరిగానే ఈగ్రంథం కూడా శివపార్వతీ సంవాదంగా సాగింది. మొదటి ఐదు అధ్యాయాల్లో సామ్రాజ్యలక్ష్మి దివ్య నివాసస్థానం, ఆమె పరివారం గురించి వివరింపబడింది. మూడో అధ్యాయంలో దేవి మానవరూపంలో చిత్రింపబడింది. క్షీరసాగరంచే ఆవరింపబడ్డ శ్వేతదీపంలో వుండే విజయ అనే నగరంలో చింతామణి నిర్మిత రాజ ప్రాసాదం ముందు, కల్పవృక్షం క్రింద, రత్న ఖచిత సింహాసనం మీద, సహస్ర దళ కమలం మధ్య దివ్య మంగళ రూపిణి సామ్రాజ్యలక్ష్మి పద్మాసన స్థితయై విరాజిల్లుతూంది. ఆమె సదా అష్టలక్ష్ముల, విజయ మొదలైన శక్తిదేవతలు శంఖకాహళాల్ని వూదుతున్నారు. విజయ ఘోషలు చేస్తూ, యుద్ధ భేరీలు మోగిస్తున్నారు. సామ్రాజ్యలక్ష్మి అందంగా అలంకరించబడ్డ గజాశ్వవీర యోధుల సేవలు పొందుతూ వుంది. ఈ అధ్యాయంలో దేవి వస్త్రాభరణాలు వర్ణించబడ్డాయి. తర్వాతి 18 అధ్యాయాల్లో విశేషపూజావివరాలు, దేశానికి దాపురించే కరువు కాటకాలు, అంటువ్యాధులు, శత్రువుల దాడులు, వరదలు - ఉప్పెనలు మొదలైన దుర్ఘటనల నివారణకు సంబంధించిన ఆచరణలు వివరింపబడ్డాయి. ఈ విధంగా మొదటి 30 అధ్యాయాల్లో సామ్రాజ్యలక్ష్మి వృత్తాంతం, స్తుతి, అనుష్ఠాన, జపహోమాది వివరాలు వర్ణింపబడ్డాయి.

రచయిత గ్రంథంలో 'విజయాఖ్యాపుర రమ్యే' అన్న పదం ప్రయోగించాడు. కాబట్టి ఆయన దృష్టిలో విజయనగరం మెదుల్తూ వుండిందని వూహించవచ్చు. విజయనగర సామ్రాజ్యం దాదాపు దక్షిణ భారతదేశమంతా విస్తరించివుండింది కనుక సమృద్ధమైన ఈ సామ్రాజ్యాన్ని దృష్టిలో

వుంచుకొనే రచయిత సుఖసమృద్ధుల సంకేతంగా 'సామ్రాజ్యలక్ష్మి' అనే పదం ప్రయోగించి వుండొచ్చని భావించవచ్చును. విజయనగర చక్రవర్తుల పాలనలోని సాంఘిక, ధార్మిక, సాంస్కృతిక పరిస్థితులు తెలుసుకోవటానికి ఈగ్రంథం చాలా తోడ్పడుతుంది. విజయనగర సామ్రాజ్యవైభవాన్ని రచయిత తన కల్పనాశక్తి ద్వారా పాఠకుల కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

31వ అధ్యాయం తర్వాతి అధ్యాయాల్లో రాజ్యం, రాజధానిలోని ప్రాంతాల్ని గ్రంథకర్త విస్తృతంగా వర్ణించాడు. సుమారు ఏడు అధ్యాయాల్లో కోటల్ని వర్ణించాడు. కోటల్ని నిర్మించేందుకు స్థలాల్ని ఏన్నుకోవడం, రేఖాపటాల్ని తయారు చేయడం గురించి వివరంగా తెలియచేశాడు. గిరి, వన, గహ్వర, మిశ్ర, నర, జల, భూ, కాష్ఠ దుర్గాలని కోటల్ని ఎనిమిది రకాలుగా విభజించాడు. గిరిదుర్గం అత్యంత శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది. వివిధ ఆకారాల్లో ఎనిమిది రకాలైన గిరిదుర్గాల్ని కవి పేర్కొన్నాడు. అనిష్ట సూచకాలైన ఎనిమిదిరకాల దుర్గాల్ని గురించి కూడా రచయిత చెప్పాడు. లోపలి, బయటి రక్షక ప్రాకారాల్ని, వాటిని కాపాడే విధానం గురించి కూడా చెప్పాడు. రాజ్యపాలనకు సంబంధించిన వివిధ శాఖలకు అనువైన స్థలాలు, వివిధ శాఖల అధికారులకు ఇళ్ల ప్రణాళికా బద్ధంగా నిర్మించి, రాజధాని నిర్మాణం గురించి చెప్పడానికి ఓ అధ్యాయమే కేటాయించబడింది. రాజప్రాసాద నిర్మాణం గురించి, దానికి అనుషంగికమైన ఇతర భవనాల గురించి కూడా వివరాలు మనకు లభిస్తాయి. నవరంగ మంటపంగా ప్రసిద్ధమైన పట్టాభిషేక సభామంటప నిర్మాణం, దాని అలంకరణ వివరాలు మనకు ఇందులో లభిస్తాయి. చక్రవర్తి జన్మదిన, శత్రు విజయ సందర్భాల్లో పట్టాభిషేక మహోత్సవం జరుగుతుంది. మనకు ఇలాంటి విశేషాలు ఎన్నో ఈ గ్రంథం ద్వారా విశదమవుతాయి.

బాహత్తారు (72) విధాల రాజోద్యోగులతో చక్రవర్తి నగర ప్రవేశం చేస్తాడని వివరించబడింది. అధికారుల పట్టీ ఇవ్వబడింది. సామ్రాజ్యలక్ష్మి అనుగ్రహం సంపాదించాలంటే రాజకుమారుడు 64 కళల్లో ప్రావీణ్యం సంపాదించాలి. ఈ చతుష్షష్టి కళల పేర్లు మనం ఇందులో చూడొచ్చు.

'సామ్రాజ్యలక్ష్మీ పీఠిక లోని కొన్ని అధ్యాయాల్లో రాజు దైవాంశ సంభూతుడని చెప్పబడింది.. ప్రభువు కర్తవ్య నిర్వహణ, గుణగణాలు వివరింపబడ్డాయి. పాలకుని నిత్యనైమిత్తిక కృత్యాలు వర్ణింపబడ్డాయి. రాజు ప్రాతఃకాలం చేసే పూజలు, పాలనా వ్యవహారాలు వివరింపబడ్డాయి. చక్రవర్తి కుటుంబ సభ్యులతో కలిసి చేసే మధ్యాహ్న భోజనం, సాయంకాల వ్యాయామం, కవి పండిత గోష్ఠులు, వినోదవిలాస కార్యక్రమాలు వివరింపబడ్డాయి.

'సామ్రాజ్యలక్ష్మి పీఠిక' లో ఒక అధ్యాయం వేటకే కేటాయించబడింది. రాజు రాజ్యాన్ని క్రూరమృగాల బారి నుంచి రక్షించేందుకని అప్పుడప్పుడు వేటకు వెళ్లుతుండాలని రచయిత సూచిస్తాడు. మృగయావినోదం వల్ల రాజు శక్తిసామర్థ్యాలు పెంపొందడమే కాక అతని కీర్తి ఇతర రాజ్యాలకు కూడా వ్యాపిస్తుందని రచయిత ఆశయం. ఈ అధ్యాయంలో వేట గురించి చాలా ఆసక్తికరమైన విషయాలు చెప్పబడ్డాయి. వేట వినోదక్రీడ మాత్రమే కాదనీ, దానివల్ల యుద్ధనీతి,

రాజనీతి రాజుకు కరతలామలకం అవుతుందని రచయిత అంటాడు. మల్లికార్జున వృక్షాలతో నిండిన శ్రీశైల అరణ్య ప్రాంతాన్ని వేటకోసం నిర్దేశించడం (శ్రీశైల తటవత్ ఉల్లసన్ మల్లికార్జునమ్) వల్ల, మల్లికార్జునుడు (శివుడు) కర్ణాటకలో ఎక్కువ ప్రచారంలో వున్నందువల్ల, ఈ రచయిత కర్ణాటకకు చెందినవాడు అయివుండొచ్చునీ, వీరశైవుడయి కూడా వుండొచ్చునీ ఊహించడానికి అవకాశం వుంది.

'సామ్రాజ్యలక్ష్మి పీఠిక' లోని కొన్ని అధ్యాయాల్లో ప్రజాపరిపాలనా విధానం, రాజనీతి గురించి చెప్పబడింది. మంత్రి, సేనాపతి, పురోహితుడు, గూఢచారులు మొదలగు అధికారుల అర్హతల్ని పేర్కొన్నాడు. రాజ్యాన్ని సజావుగా పాలించాలంటే ఈ అధికారులందరి సహాయసహకారాలు పొందడం అవసరమని సలహా ఇచ్చాడు.

రచయిత పట్టపురాణి గుణగణాల్ని ఓ అధ్యాయంలో వివరించాడు. అప్పటి పాలనావ్యవహారాల్లో సామ్రాట్టుతో పాటు సామ్రాజ్ఞి కూడా పాల్గొనేవారు. ధార్మిక, సాంఘిక కార్యకలాపాల్లో ముఖ్యపాత్ర వహించేవారు.

ఈ గ్రంథంలోని విషయబాహుళ్యం రీత్యా కొన్ని అధ్యాయాల్ని ఈ విధంగా విభజించవచ్చు. రాజ్యంలోని ఏడుప్రాంతాలు, రాజుగారి ఏడు అంగాలు, ఆరు తత్వాలు, చతురోపాయాలు, యుద్ధస్థితి, చతురంగ బలాలు, కోటలు, ఆయుధాలు, ధనుర్విద్య, సేనావ్యూహరచన, దండయాత్ర, రథనిర్మాణం గురించి ఓ ప్రత్యేక అధ్యాయం. సైన్యం స్థితి గతుల్ని చక్రవర్తి స్వయంగా పర్యవేక్షించేవారని ఈ గ్రంథం ద్వారా తెలుస్తుంది.

రాజు, రాజకుటుంబీకులు ఆచరించే 24 పండుగల వర్ణన, వాటి ఆచరణ విధానం 'సామ్రాజ్యలక్ష్మి పీఠిక' లో వర్ణింపబడ్డాయి. శ్రీరామ నవమి, నరసింహజయంతి, వృషభవ్రతం, వరలక్ష్మీ వ్రతం, శ్రీకృష్ణ జయంతి, వినాయక చవితి, నవరాత్రి, దీపావళి, శివరాత్రి మొదలైన పండగలు, నవరాత్రి సందర్భంలో అంగరంగ వైభవంగా జరిగే 25 రకాల వినోద కార్యక్రమాలు వర్ణింపబడ్డాయి. నవరాత్రి వేళల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు ఆధునిక మైసూరు దసరా వేడుకలకు దారిదీపాలయ్యాయని తోస్తుంది. 'సామ్రాజ్యలక్ష్మి పీఠిక' లో ఖురళీ ( ఆయుధ) పూజ వర్ణింపబడింది.

'సామ్రాజ్యలక్ష్మి పీఠిక' సంస్కృత గ్రంథాన్ని తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయం ప్రచురించింది. కొంతమంది రాజకుమారుల పేర్లతో కూడుకొన్న ఈ గ్రంథం నకలు ప్రతులు తంజావూరు సరస్వతీ మహలు గ్రంథాలయంలో భద్రపరచబడివున్నాయి. ఈ గ్రంథం అసమగ్రమమని సహసంపాదకుల్లో ఒకరైన కె. వాసుదేవశాస్త్రి అభిప్రాయం:

'సామ్రాజ్యలక్ష్మి పీఠిక' మధురమైన సంస్కృత కావ్యం. ఇది ఎంతో ఆసక్తికరంగా, నీతి దాయకంగా రూపొందింది. విజయనగర సామ్రాజ్య కాలం నాటి సాంఘిక, ధార్మిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితుల్ని తెలుసుకోవడానికి ఈ గ్రంథం చాలా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు.

# అంతరంగపు చిక్కుదారుల అక్షర చిత్రాలు గీసిన కవి

- యస్. ఎ. మహమ్మద్,

నీడలతో లోకాలను సృజించి, అంతరంగాపు చిక్కుదారుల అక్షర చిత్రాలు గీసిన మెక్సికన్ కవి, 1990 వ సంవత్సరపు నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత ఆక్టేవి యోపాజ్ అస్తమించాడు. దీర్ఘకాలంగా అస్వస్థుడుగా ఉన్న పాజ్‌ను మృత్యువు క్యాన్సర్ రూపంలో కబళించింది. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. లాటిన్ అమెరికా రచయితల్లో అగ్రగణ్యుడయిన పాజ్ మరణం మెక్సికోకే కాదు, సమస్త వర్తమాన ప్రపంచ చింతనకు, సాహిత్య, సంస్కృతి రంగాలకు తీరనిలోటు. నిస్సంశయంగా, వర్తమాన ప్రపంచపు వాస్తవ సంక్లిష్టతను విశదీకరించిన వారిలో పాజ్ గొంతుక విస్పష్టమైనది. తన చింతనతో, ఐంద్రియక సుఖప్రజ్ఞా సమన్వితమైన గొప్ప అవగాహనతో మన శతాబ్దపు మలి అర్థ భాగాన్ని పూర్తిగా సుసంపన్నం చేశాడు.

**సన్ స్టోన్**

సుదూరాంబరాన రెక్కలెన్నో విచ్చుకున్న ఓతేజో భ్రాంతి.  
సూర్యుడు విసురుగా నా నుదుట ఒక ప్రవేశ ద్వారాన్ని తెరచి  
చివరకు మూసి ఉన్న నాకను రెప్పలను విప్పేడు.  
ఈదరి వెలుతురు పరుచుతున్నది.  
మనం వీక్షించని స్పృశించని వెలుగు.  
మనం స్పర్శించేది దర్శించేది  
దాని శూన్య స్పష్టతల్లో ఇమిడి ఉంది.  
నాకన్నులు స్పృశించేదాన్ని  
నేను నా ముని వేళ్ళతో చూస్తాను :  
నీడలను, ప్రపంచాన్ని.  
నీడలతో నేను లోకాలను సృజిస్తాను,  
నీడల తోనే లోకాలను వెద జల్లుతాను.

- ఆక్టేవియో పాజ్

మృదుభాషి, మనుషుల పట్ల తిరస్కారమున్నదా? అనిపించేంత ఎడంగా ఉండే పాజ్ శైలి కొన్ని వర్గాల్లో పరుషంగా ఉంటుంది. పాజ్ కవితా వస్తువులు చాలవరకు మెక్సికన్ చరిత్రకు, పురాణాలకు సంబంధించినవే. వ్యక్తీ కరణలో సౌందర్యాన్ని నింపుకున్న పాజ్ రచనల్లో గాఢమైన తాత్విక చింతన కనిపిస్తుంది. తవరచనలతో మెక్సికన్ సాహిత్యపు స్వరూపాన్ని మనోజ్ఞమైన తన శైలిలోని క్లుప్తత, స్పష్టతలతో మెక్సికనుల వ్యక్తీకరణ విధానాన్నే పాజ్ పూర్తిగా మార్చి వేశాడు. చాలా మంది మెక్సికన్ రచయితల్లానే పాజ్ తన దేశపు బహుముఖీన వైరుధ్యాలను అసంబద్ధతలను విశ్లేషించడం లోను వాటిని అర్థం

చేసుకోవడంలోను మునకలయ్యారు. ప్రాచీనమైన ఇండియన్ గతం, ఇటీవలి స్పానిష్ వారసత్వం, వీటికలయికతో ఉద్భవించిన, మెక్సికనులనే విస్మయ పరిచే సంస్కృతి. పాజ్ వ్యక్తిత్వంలో చాలమంది మెక్సికనులు తమ ప్రతిబింబాన్ని చూసుకునేందుకు ఇష్టపడతారు. ఎంతోమంది మెక్సికన్ రచయితలకు పాజ్‌శైలి ఆదర్శప్రాయమైంది. అతని స్ఫూర్తితో అంతవరకు వ్యాప్తిలో ఉన్న డొంకతిరుగుడు ధోరణికి స్వస్తి చెప్పారు.

1990 లో నోబెల్ సాహిత్య పురస్కారాన్ని అందుకోక పూర్వం. 1982 లో స్పెయిన్ దేశపు ప్రతిష్టాత్మకమైన Miguel Cervantes Proze ను 1987లో షికాగోలో టి.యస్. ఎలియట్ అవార్డును కూడ పాజ్ అందుకున్నాడు.

పాజ్ ప్రధానంగా కవి అయినా అతని రచనా పరిధి విస్తృతమైంది. కవిత్వంతో పాటు రాజకీయ విశ్లేషణ, చరిత్ర, కళ, సంస్కృతి విషయాలను గురించి రాసాడు. పాజ్ వ్యాసాలు రాసినా వాటిలో కవిత్వం ఉంటుంది. వ్యాసకర్తగా కూడ పాజ్ ప్రాచుర్యం పొందడానికి అతని కవితాత్మక వచనమే కారణం.

పాజ్ దృష్టిలో కవిత్వం సర్వోత్కృష్ట సాహిత్య ప్రక్రియ. ''కవిత్వం అంతరంగపు లోతుల్లో నుండి వస్తుంది. వచనాని కందని లోలోపలి అనుభవాలను అవిష్కరిస్తుంది. కవిత్వంలో పదాల వస్త్వాక, భౌతిక, బౌద్ధిక భాగాల మధ్య పరస్పరాన్వయ అర్థచ్ఛాయలుంటాయి. ఇది వచనంలో కానరాదు. కారణం మంచివచన మెప్పుడూ అగోచరమే. కాని కవిత్వంలో ప్రతి పదానికి దాని గరిమ ఉంటుంది.'' అని పాజ్ అన్నాడు.

మొదటి ప్రపంచయుద్ధం, మెక్సికన్ విప్లవాలు చేసిన గాయాల మచ్చలతో నిండిన 1914వ సంవత్సరంలో మార్చి 31వ తేదీన పుట్టిన పాజ్ మెక్సికో నగర శివార్లలో పెరిగి పెద్దవాడయ్యాడు. పాజ్ తాతతండ్రుల జీవితాలు కూడా ఉద్యమాల లోనే గడిచాయి.

16 సంవత్సరాల వయసున్నపుడు పాజ్ తన మొదటి కవితను, తదుపరి సంవత్సరమే తన మొదటి వ్యాసాన్ని ప్రచురించాడు. మెక్సికోలోని నేషనల్ లిటానమస్ యూనివర్శిటీలో చదువుతున్నప్పుడు పాజ్‌కు మార్క్సిస్టు విద్యార్థి వర్గాలతో పరిచయం ఏర్పడింది. పాజ్ తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. యుక్త వయస్సులో తాను రాసిన రచన ప్రతిదొకదాన్ని, మరొక నోబెల్ పురస్కార గ్రహీత, చిలీ దేశపు కవి అయిన పాబ్లో నెరుడాకు పంపించాడు. పాజ్ రచన నెరుడాను కదిలించగా, దానిని అభినందిస్తూ నెరుడా అనుకూల సమీక్ష రాశాడు. స్పెయిన్‌లో

జరుగుతున్న ఫాసిస్టు వ్యతిరేక రచయితల సమావేశానికి హాజరు కమ్మని నెరుడా పాజ్‌కు సలహా ఇచ్చాడు. అక్కడ పాజ్‌కు మరికొందరు వామ పక్ష రచయితలతో పరిచయ మయింది. సమావేశానంతరం అక్కడే ఉండి పోయిన పాజ్ రిపబ్లికన్ దళాలతో కలిసి Francisco Franco కు వ్యతిరేకంగా పోరాడాలనుకున్నాడు. కాని పాజ్ వామపక్ష నిబద్ధతను కొందరు శంకించడం వల్ల అతని చేతికి తుపాకి నివ్వలేదు. మెక్సికోకు తిరిగి వచ్చిన పాజ్ Elpopular అనే సోషలిస్టు వార్తాపత్రికను, Taller అనే పత్రికను నిర్వహించాడు. కొంతకాలం హాలీవుడ్ సినిమా స్క్రిప్టులను స్పానిష్ భాషలోకి అనువాదాలు చేశాడు. ఆ తరువాత రాయబార వృత్తిలో పాజ్ జపాన్, యునైటెడ్ స్టేట్స్, ఇండియాలలో కూడ పని చేశాడు. 1976 లో పాజ్ స్థాపించిన Vuelta అనే పత్రిక లాటిన్ అమెరికాలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సాహిత్య పత్రిక అయింది. చివరి వరకు పాజ్ తానే ఈ పత్రికకు నిర్దేశకుడుగా ఉన్నాడు.

అయితే రాను రాను పాజ్ వామపక్ష ఉద్యమానికి దూరమవుతూ వచ్చాడు. వామ పక్ష ఉద్యమంతో పాజ్‌కు పలుమార్లు విభేదాలు తలెత్తాయి. తాను వామ పక్ష విరోధి అన్నదాన్ని పాజ్ ఒప్పుకోలేదు. అయితే మార్క్సిజమ్ తో తనకు ప్రగాఢమైన అనుబంధమేమీ లేదన్న పాజ్ తనను తాను సోషల్ డెమోక్రాట్‌గా పిలుచుకున్నాడు. ''నేను ఒక చర్చిలో భాగస్వామిని వామ పక్షీయులు నన్ను ద్వేషిస్తూనే చదువుతారు. నేను అభివృద్ధి నిరోధకుడినని కొందరి అభిప్రాయం. అయితే అలా నన్ను విమర్శిస్తున్నది మెక్సికన్ జాతి కాదు. ఒక సక్రమమయిన చారిత్రక పరిణామం లేని మేధావి వర్గం నన్నలా విమర్శిస్తున్నది'', అని పాజ్ అన్నాడు.

పాజ్ తన రచనలను స్పానిష్ భాషలో చేశాడు. చాల వరకు అవి ఆంగ్ల భాషలోనికి అనువాద మయ్యాయి. పాజ్ ప్రారంభంలో రాసిన లేబరింత్ ఆఫ్ సాలిట్యూడ్ అనే వ్యాసం, సన్‌స్టోన్ అనే కవిత చాల ప్రాచుర్యం పొందాయి. లేబరింత్ ఆఫ్ సాలిట్యూడ్ లో పాజ్ మెక్సికో చరిత్రను, ''ఛిద్రమైన లేక అపరిచిత వ్యవస్థల ముసుగు తొడుక్కున్న మాక్రైమా గవేషణ'' అని వర్ణించాడు. ఈ పుస్తక ప్రచురణానంతరం చాల మంది మిత్రులు పాజ్‌తో మాట్లాడం మానివేశారు. సన్‌స్టోన్ అనే కవితలో మెక్సికనులు సగర్వంగా చెప్పుకునే వారి అర్థతా రాహిత్యాన్ని దుయ్య బట్టారు. దీంతో పాజ్‌ను ద్వేషించే వాళ్ళు, అభిమానులు కూడ ఏర్పడ్డారు.

పాజ్ 1962 నుండి 68 వరకు భారతదేశంలో రాయబారిగా ఉన్నాడు. మనదేశానికి సంబంధించి పాజ్ రాసిన ఇన్ లైట్ ఆఫ్ ఏసియా (ఆంగ్లానువాదం) 1997 ప్రచురితమయింది.

పాజ్ మన దేశపు రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య పునాదులను చాలాలోతుగా పరిశీలించాడు. పాజ్‌రాసిన ఈ క్రింది మాటలను పరికిస్తే ఆయన భారతదేశాన్ని ఎంత లోతుగా అర్థం చేసుకున్నాడో అవగతమౌతుంది.

''హిందువుల మత, కవిత్వ, న్యాయ, చారిత్రక గ్రంథాలు భారతీయ ముస్లింల గ్రంథాల కంటే పూర్తిగా భిన్నమైనవి. వారిరువురి వాస్తు, కళా సాహిత్య రీతుల్లో కూడ అసలు సామ్యం లేదు. ఇవి రెండు ఒకే భూభాగంపై విలసిల్లిన రెండు నాగరికతలా? ఒకే నాగరికతతో పరిపుష్టం చెందిన రెండు మతాలా? ఏమైనా చెప్పడం కష్టం. హిందూమతం భారతదేశంలో పుట్టింది. క్రీ. పూ. రెండవ శతాబ్దంలో ఈ ఖండం పై స్థిరపడిన ఆర్య తెగల వైదిక మతంతో దీనికి సమీప పిత్ళ సంబంధం ఉంది. దీనికి భిన్నంగా ఇస్లాం మతం బయటి నుండి వచ్చింది. సంపూర్ణమైన దాని మత సిద్ధాంతంలో మరేది ఇమడదు. మొదట్లో ఇస్లాం ప్రజలపై రుద్దబడింది. అయితే ఈ మతం ఇక్కడ వేళ్ళూనుకుంది. ఇన్ని శతాబ్దాల సహజీవనానంతరం కూడ ఈ రెండు మతాలు తమతమ ప్రత్యేకతను నిలబెట్టు కున్నాయి. .......................................... హిందూ మతం భిన్న విశ్వాసాల, కర్మకలాపల సమాహారం. ఈ మతం వ్యవస్థీకృతం కాదు. క్రైస్తవ, ఇస్లాం మతాల్లోలా మతాంతరీకరణ దీనికి తెలియనిది. అయితే ఒక పెద్ద కొండచిలువలా ఈ మతం నెమ్మదిగా, అవిశ్రాంతంగా, పరాయి సంస్కృతులను, దేవతలను భాషలను, విశ్వాసాలను జీర్ణం చేసుకుంటుంది.''


వర్తమాన అన్వేషణలో ఎగసి, వెనుకకు మరలిన కెరటం ఆక్టెవియోపాజ్. మానవతా నిజాయితీతో, గాఢాను రక్తితో వర్తమాన వాస్తవాన్ని, సంక్లిష్టతను విశదీకరించినందుకు అతనికి మనం కృతజ్ఞులుగా ఉంటాం. తన నోబెల్ బహుమాన స్వీకార ప్రసంగం అంతిమభాగంలో ఆధునికతను గురించి పాజ్ చేసిన విశ్లేషణ.

''ఆధునికతను ఆమెను నిరంతర మారు వేషాల్లో మనం వెంబడిస్తూ ఉంటాం. అయినప్పటికీ మనం ఆమెనెన్నటికీ బంధించలేం. ఆమె ప్రతిసారి తప్పించు కుంటుంది. ప్రతి కలయిక ఒక పలాయనంలో ముగుస్తుంది. ఆమెను మనం కౌగలించుకుంటాం. హఠాత్తుగా ఆమె అంతర్ధానమౌతుంది : అదొక క్షణికమైన చిన్నిపీచిక - ప్రతిచోటా ఉంటూ ఎక్కడా ఉండని విహంగం దాన్ని మనం సజీవంగా బంధించాలనుకుటాం కాని అది రెక్కలొచ్చి ఒకగుప్పెడు ధ్వనుల రూపంలో అదృశ్యమౌతుంది. మనం రిక్తహస్తాలతో మిగిలి పోతాం. అప్పుడు నెమ్మదిగా మన జ్ఞాన ద్వారాలు తెరుచుకుంటాయి. మనకు తెలియకుండానే మనం అన్వేషిస్తూ ఉండిన ఇతరకాలం మనముందు ప్రత్యక్ష మౌతుంది. అదే వర్తమానం అదే వునికి.''



*Sculptor Niranjan Pradhan gives the finishing touches to a statue of Raja Rammohan Roy, at his Salt Lake studio. The statue will be sent to London.*

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



## మైకలాంజెలో చిత్రించిన "అంతిమ తీర్పు"

"జీసస్ మన పాపాలకు శిలువ మీద మరణించాడు. ముళ్ళు, మేకులతో గుచ్చి, రాళ్ళతో కొట్టి చంపారు. అయినా ఆయన చలించ లేదు. దేవునితో ఐక్యమయ్యాడు". ఇది మనం మామూలుగా ఊహించుకొనే చిత్రం. మైకలాంజెలో చిత్రం దీనికి భిన్నమైంది. కుపితుడైన గ్రీకు దేవునిలా, ఇందులో, పశ్చాత్తాపంచెందని పాపులను శిక్షించడానికని చేయెత్తి కనిపిస్తాడు. అతని మధ్య శరీరం వడ్రంగిని గుర్తుకు తెస్తుంది. డాంటే వర్ణించిన యమ దూతలు క్రింది భాగంలో కనిపిస్తారు.